



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 70 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 03 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## వినియోగదారే
# విద్యుత్ ఉత్పత్తిదారు..



- ❑ ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ఉత్పత్తి
- ❑ ఫెర్రో అల్లాయ్స్‌కు మరో ఏడాది ప్రోత్సాహకాలు పొడిగింపు
- ❑ ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు
- ❑ రాష్ట్రంలో 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
- ❑ ఎనర్జీ రంగంలో ఒప్పందాలు 60 రోజుల్లో కార్యారూపం దాల్చాలి
- ❑ పీపీఏల రద్దుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం మోపిన గత పాలకులు
- ❑ విద్యుత్ వ్యవస్థల సమర్ధ నిర్వహణతో భారాన్ని జీరో చేశాం
- ❑ విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్ గౌర్‌తో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారిన పడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతి చెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చిగ్గర మైట్ తరహా కీటకాలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధితో పాటు, ప్రమాదాన్ని ఏ విధంగా కట్టడి చేయాలనేదానిపై ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ క్రమంలో చందక రాజేశ్వరి మృతికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రికి సౌరభ్ గౌర్ వివరించారు. విజయనగరానికి చెందిన రాజేశ్వరీ అనే మహిళను చిగ్గర్ మైట్ అనే కీటకం కుట్టిందని, దీంతో ముందుగా టైఫాయిడ్ చికిత్స అందించారని... ఆ తర్వాత రాపిడ్ టెస్ట్ ద్వారా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేల్చారని సౌరభ్ గౌర్ సీఎంకు వివరించారు. విజయనగరం క్యాపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేశ్వరి చనిపోయారని అధికారులు చెప్పారు. స్క్రబ్ టైఫస్ కేసులు, ఆ వ్యాధి లక్షణాలు, అలాగే వాటి వల్ల ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోననే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు.

**స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదు**

ఓరింటియా సుసుగాముషి అనే బాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది అంటు వ్యాధి కాదని మిగతా .. 2లో..

#### ప్రాజెక్టుల శంకుస్థాపనకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను
## ఆహ్వానించిన మంత్రి టీజీ భరత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ భారతదేశం యొక్క అధునాతన రక్షణ తయారీ కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంత్రి టీజీ భరత్ ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ని కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు ప్రధాన రక్షణ తయారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికి అధికారికంగా ఆహ్వానించారు. శ్రీ సత్యసాయి జిల్లా, కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ ద్వారా డిఫెన్స్ ఎనర్జిటిక్స్ &మందుగుండు సామగ్రి ఫిల్లింగ్ కాంప్లెక్స్, మడకశిర, మిగతా .. 2లో..

#### ఢిల్లీలో జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో
## మంత్రి లోకేష్ భేటీ
### ఏపీలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధిపై చర్చ



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరెన్నికగన్న జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ మిగతా .. 2లో..

## రేపే సాంస్కృతిక సంబరం.. కళల సౌరభం...

- ‘ఉద్భవ్-2025’కు సర్వం సిద్ధం
- 3 రోజుల పండుగకు తరలివచ్చిన అడవి బిడ్డలు
- పోటీలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వ ఏర్పాట్లు
- ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి జాతీయ స్థాయి ఉత్సవాలు
- ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్
- గిరిజన సంస్కృతి చాటే విధంగా మస్కట్ గా ‘క్రిష్’ ఏర్పాటు
- బుధవారం ఉదయం 10గం.లకు కేఎల్ యూనివర్శిటీలో ఆరంభం
- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు, చిన్నారులు



మంత్రి జువల్ ఓరమ్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మరో అద్భుతమైన వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేదిక కాబోతోంది. గిరిజన విద్యార్థుల ఆటపాటలు, వారి సంస్కృతి సంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేయనున్నాయి. అడవిబిడ్డలలో దాగి ఉన్న ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ‘ఉద్భవ్-2025’ సిద్ధమైంది. గిరిజన సంస్కృతి, కళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా అమరావతి రాజధానిలోని కేఎల్ యూనివర్శిటీలో మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ**

జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎమ్ఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో జరగడం తొలిసారి. బుధవారం ఉదయం 10గం.లకు అట్టహాసంగా ప్రారంభమయ్యే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ హాజరవుతున్నారు. విద్యార్థుల పోటీల కోసం మొత్తం 12 వేదికలను సిద్ధం చేశారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు సంబంధించి ఏకంగా 35 విభాగాల్లో పోటీలు మిగతా .. 2లో..

## పవన్ కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దు : జనసేన



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వస్తోన్న విమర్శలపై జనసేన పార్టీ స్పందించింది. “రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం దృష్ట్యా పవన్ కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దు” అని మిగతా .. 2లో..



**విశ్వం వాయిస్ న్యూస్ :** భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం ప్రార్థిస్తున్నట్లు ట్వీట్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఆయన పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. “మీ నాయకత్వంలో భాజపా అనేక ఎన్నికల్లో విజయాలు సాధించింది. దేశవ్యాప్తంగా పార్టీ మరింత బలోపేతమైంది. మీ నాయకత్వ పటిమ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల నిబద్ధత లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి” అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

#### అమరావతిలో రెండో విడత
## భూసమీకరణకు ఆదేశాలు..
### - సీఆర్డీఏకు బాధ్యతలు -



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఏడు గ్రామాల్లో 16,666.57 ఎకరాల పట్టా, ఎసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురంలో 1,965 ఎకరాలు, పెద్దమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాల పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమి.. కర్లపూడి లేమల్లెలో 2,603 ఎకరాల పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురంలో 1,448.09 ఎకరాల పట్టా, 2.29 ఎకరాల అసైన్డ్, మిగతా .. 2లో..

## తిరుమల వైకుంఠ ద్వార దర్శనం..
### తొలి 3 రోజులకు 1.76లక్షల టోకెన్లు జారీ



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ-డిప్ ద్వారా తితిదే టోకెన్లు కేటాయించింది. వైకుంఠ ఏకాదశి తొలి 3 రోజుల దర్శన టోకెన్ల కోసం 25,72,111 మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. +ఈ-డిప్ ద్వారా 1.76లక్షల టోకెన్లను జారీ చేసినట్టు తితిదే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా 8,71,340 మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. ఈ-డిప్ ద్వారా 57వేల మందికి టోకెన్ల కేటాయింపు, ఈనెల 31న దర్శనానికి 8,52,404 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 64వేల మందికి కేటాయింపు, జనవరి 1న దర్శనానికి 8,48,367 మంది రిజిస్ట్రేషన్.. 55వేల మందికి కేటాయింపు, వైకుంఠ ద్వార దర్శనాల్లో మిగతా .. 2లో..

#### సర్పంచ్‌లు మంచోళ్లు ఉంటేనే
## గ్రామాలు అభివృద్ధి
### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**కొత్తగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. “తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది ఇక్కడే. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి మిగతా .. 2లో..

# వినియోగదారే విద్యుత్ ఉత్పత్తిదారు..

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు స్పష్టం చేశారు. చిగ్గర మైట్స్ అనే కీటకాలు కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు... మైట్ కుట్టిన తర్వాత పుండ్లు ఏర్పడడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని ముఖ్యమంత్రికి తెలిపారు. సకాలంలో చికిత్స అందిస్తే, ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెప్పారు. ఈ మేరకు స్క్రబ్ టైఫస్ వంటి వ్యాధి పట్ల ప్రజలు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు చూడాలన్నారు. ఏవైనా కీటకాలు కుట్టిన వెంటనే పరీక్షలు చేయించేలా చూడాలని... వ్యాధి తీవ్రత పెరగకముందే అవసరమైన చికిత్స అందించేలా వైద్యారోగ్య శాఖ సిద్దంగా ఉండాలని సీఎం సూచించారు. ఈ ఏడాదిలో చిత్తూరు, కాకినాడ జిల్లాల్లో కేసులు నమోదు అయ్యాయని అధికారులు చెప్పారు. చిన్న చిన్న కీటకాలు కుడితే మృత్యువాత పడే స్థాయికి పరిస్థితి రాకూడదని... పూర్తిస్థాయిలో అవగాహన పెంచడమే దీనికి సరైన మార్గమని ముఖ్యమంత్రి చెప్పారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కీలకమైన పరిశ్రమలుగా వీటిని గుర్తించి మరో ఏడాదిపాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. తద్వారా ప్రభుత్వంపై రూ.1,053 కోట్ల భారం పడనుంది. మంగళవారం సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకించి విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను 2029 నాటికి 9.20 శాతం నుంచి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీఎం సూచించారు. పీఎం కుసుమ్ సహా ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద 4,792 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు 483కు పైగా ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి 150 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా విద్యుత్ పొదుపు చేసేలా ఉపకరణాలు వినియోగించేందుకు అవగాహనా కార్యక్రమాల్ని చేపట్టాలని సీఎం సూచించారు.

**ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు 60 రోజుల్లో కార్యాచరణ**

రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలు ఐస్(ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ) పాలసీ ద్వారా 60 రోజుల్లోనే తమ కార్యాచరణను ప్రారంభించేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అనుమతులు జారీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ ఓ న్యూ ఎనర్జీ హబ్‌గా మారాలని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రావాల్సి ఉందని అన్నారు. అలాగే విద్యుత్ సంస్థలు రుణ సమీకరణలో వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విద్యుత్ కొనుగోళ్లలోనూ వ్యయం తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు 20 పైసల చొప్పున కొనుగోలు వ్యయం తగ్గించినట్టు సీఎస్ కె.విజయానంద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈపీఎంఎస్ విధానంతో నిరంతరం పర్యవేక్షణ ద్వారా రూ.400 నుంచి 500 కోట్ల మేర పొదుపు చేయగలిగామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాల ద్వారా కొనుగోలు వ్యయం తగ్గుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలకు, వాణిజ్యం, గృహ అవసరాలు, వ్యవసాయ రంగానికి జరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించాలని.. డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీఎం కుసుమ్ కింద దేవాదాయ, జలవనరుల శాఖలకు చెందిన భూముల్లో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. వినియోగదారులే విద్యుత్ ఉత్పత్తి చేయటం ద్వారా తాము వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం ఆర్జించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే సోలార్ రూఫ్ టాప్ పథకం కింద సౌర ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. బీసీ వినియోగదారుకు 3 కిలోవాట్ల వరకూ రూ.20 వేల సబ్సిడీ అమలు చేసేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చేనేతలకు ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కూడా అమలు చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మూలధన రాయితీ, జీఎస్టీ మినహాయింపు సహా 9 అంశాలకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు.

**వెయ్యి ఈవీ బస్సుల కొనుగోలు**

రాష్ట్రంలోని రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను జెన్‌కో ఇరిగేషన్ అధికారులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల వద్ద పీఎస్పీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి సాధ్యం అవుతుందని అన్నారు. ఐదేళ్లలో ఆర్టీసీ బస్సులను ఈవీలుగా మార్చాలని సీఎం సూచించారు. త్వరలోనే వెయ్యి ఈవీ బస్సుల్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు నాన్ టారిఫ్ ఆదాయం పై దృష్టి పెట్టాలని సీఎం సూచనలు చేశారు. థర్మల్ పవర్ స్టేషన్లలోని బూడిదను వివిధ అవసరాలకు సద్వినియోగం చేసుకునే అంశాన్ని పరిశీలించాలని, కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు ఐఐటీ బృందంతో అధ్యయనం చేయించాలన్నారు.

**గత పాలకుల నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థ విధ్వంసం**

గత పాలకులు విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేశారని ముఖ్యమంత్రి సమీక్షలో ప్రస్తావించారు. పీపీఏల రద్దు నిర్ణయంతో రూ.9 వేల కోట్ల మేర భారం ప్రజలపై పడిందని పేర్కొన్నారు. విద్యుత్‌ను వినియోగించుకోకుండానే ఆయా విద్యుత్ కంపెనీలకు రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థలను గాడిలో పెట్టామని తెలిపారు. విద్యుత్ వ్యవస్థల సమర్ధ నిర్వహణ ద్వారా విద్యుత్ ఛార్జీలను పెంచకుండానే ఆ భారాన్ని జీరో చేయగలిగామని సీఎం వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయటంతో పాటు దానికి రేటింగ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తిలో లోటు లేకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు చేయాలని సూచించారు. విద్యుత్ రంగంలో నూతన ఆవిష్కరణల కోసం ప్రతీ ఏటా హ్యాకథాన్ నిర్వహించాలన్నారు. ఈ సమీక్షకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్, ట్రాన్స్ కో, జెన్కో డిస్కమ్ సీఎండీలు హాజరయ్యారు.

# స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించండి

- వ్యాధి తీవ్రత పెరగక ముందే చికిత్స అందించండి
- స్క్రబ్ టైఫస్ కేసులు నమోదుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదని తెలిపిన అధికారులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్ గౌర్‌తో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారిన పడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతి చెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చిగ్గర మైట్ తరహా కీటకాలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధితో పాటు, ప్రమాదాన్ని ఏ విధంగా కట్టడి చేయాలనేదానిపై ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ క్రమంలో చందక రాజేశ్వరి మృతికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రికి సౌరభ్ గౌర్ వివరించారు. విజయనగరానికి చెందిన రాజేశ్వరీ అనే మహిళను చిగ్గర్ మైట్ అనే కీటకం కుట్టిందని, దీంతో ముందుగా టైఫాయిడ్ చికిత్స అందించారని... ఆ తర్వాత రాపిడ్ టెస్ట్ ద్వారా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేల్చారని సౌరభ్ గౌర్ సీఎంకు వివరించారు. విజయనగరం క్వాసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేశ్వరి చనిపోయారని అధికారులు చెప్పారు. స్క్రబ్ టైఫస్ కేసులు, ఆ వ్యాధి లక్షణాలు, అలాగే వాటి వల్ల ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోననే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు.

**స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదు**

ఓరింటియా సుసుగాముషి అనే బాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది అంటువ్యాధి కాదని అధికారులు స్పష్టం చేశారు. చిగ్గర మైట్స్ అనే కీటకాలు కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు... మైట్ కుట్టిన తర్వాత పుండ్లు ఏర్పడడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని ముఖ్యమంత్రికి తెలిపారు. సకాలంలో చికిత్స అందిస్తే, ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెప్పారు. ఈ మేరకు స్క్రబ్ టైఫస్ వంటి వ్యాధి పట్ల ప్రజలు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు చూడాలన్నారు. ఏవైనా కీటకాలు కుట్టిన వెంటనే పరీక్షలు చేయించేలా చూడాలని... వ్యాధి తీవ్రత పెరగకముందే అవసరమైన చికిత్స అందించేలా వైద్యారోగ్య శాఖ సిద్దంగా ఉండాలని సీఎం సూచించారు. ఈ ఏడాదిలో చిత్తూరు, కాకినాడ జిల్లాల్లో కేసులు నమోదు అయ్యాయని అధికారులు చెప్పారు. చిన్న చిన్న కీటకాలు కుడితే మృత్యువాత పడే స్థాయికి పరిస్థితి రాకూడదని... పూర్తిస్థాయిలో అవగాహన పెంచడమే దీనికి సరైన మార్గమని ముఖ్యమంత్రి చెప్పారు.

# పాక్ హ్యాండ్లర్ల కోసం భారతీయ నంబర్లతో వాట్సప్ ఖాతాలు..

పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న పం జాబ్‌కు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి దర్యాప్తులో విస్తు పోయే విషయాలు వెల్లడయ్యాయి. ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రఫుల్ల కుమార్ విలేకరులతో మాట్లాడారు. రాజ స్థాన్ గంగానగర్‌లోని సాధువాలి మిలి టరీ జోన్ సమీపంలో అనుమానాస్పదం గా కన్పించిన పంజాబ్‌కు చెందిన ప్రకాశ్ సింగ్ అలియాస్ బాదల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి ఫోన్‌లో అనేక పాకిస్థానీ నంబర్‌లతో చేసిన చాట్‌లు ఉన్నాయన్నారు. భారత్ నిర్వ హించిన ఆపరేషన్ సిందూర్ నాటినుంచి అతడు ఐఎస్ఐతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. వాట్సప్ ద్వారా వారితో కమ్యూనికేట్ అవుతున్నట్లు పేర్కొన్నారు. భారత సైన్యానికి సంబం ధించిన కదలికలను పర్యవేక్షిస్తున్నాడన్నారు. రాజస్థాన్, పంజాబ్, గుజరాత్‌లలోని దళాల కదలికలు, వాహనాలు, వంతెనలు, రైల్వే ట్రాక్‌లు, సరిహద్దు ప్రాంతాలకు సంబం ధించిన ఫొటోలు, వీడియోలను వారికి చేరవేశాడని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ హ్యాండ్లర్ల కోసం భారతీ యుల నంబర్లతో వాట్సప్ ఖాతాలు తెరవ డంలో నిందితుడి పాత్ర ఉందని అధికా రులు గుర్తించారు. దేశంలోని నంబర్లకు జారీ అయ్యే ఓటీపీలను సంపాదించి.. వాటిని పాక్ ఆపరేటర్లకు అందించాడు. వారు వాటితో వాట్సప్ ఖాతాలు తెరిచి.. దేశవ్యతిరేక కార్యకలాపాల కోసం ఉపయోగించారు. ఇందుకుగాను అతడు పెద్ద మొత్తంలో డబ్బు పొందినట్లు వివరించారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు. రాజస్థాన్, పంజాబ్‌లలో అతడి నెట్‌వర్క్‌లోని మరికొందరిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

**గ్రనేడ్ దాడులకు ప్రణాళిక..**

పంజాబ్‌లోని గురుదాస్‌పుర్‌లో గ్రనేడ్ దాడికి పాల్పడిన.. పాక్‌కు చెందిన ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసులు ఛేదించారు. కేంద్ర, రాష్ట్ర సంస్థలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించాయని బోర్డర్ రేంజ్ డీఐజీ సందీప్ గోయల్ పేర్కొన్నారు. నిందితులు, షాజాద్ భట్టి, జీషన్ అక్తర్, అనుదీప్ సింగ్ అమన్ పన్నులుగా పేర్కొన్నారు. ఈ ముఠా పలువర్గాల మధ్య ఉద్రిక్తతలు పెం చడంతో పాటు.. గ్రనేడ్ దాడులకు ప్రణాళిక వేసినట్లు తెలిపారు.

**ప్రాజెక్టుల శంకుస్థాపనకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను**

# ఆహ్వానించిన మంత్రి టీజీ భరత్

(మొదటిపేజీ తరువాయి)

హెచ్ఎఫ్‌సిఎల్ ద్వారా ఆర్టిలరీ షెల్ & మల్టీమోడ్ హ్యాండ్ గ్రెనేడ్ సౌకర్యం, దొనకొండ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా ప్రొపెల్లెంట్ & వెపన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సౌకర్యం, అనకాపల్లిలోని బిడిఎల్ ద్వారా అండర్ వాటర్ వెపన్స్ & టార్పెడో తయారీ యూనిట్ ల శంకుస్థాపనకు ఆహ్వానించారు. ప్రాజెక్టులకు రాష్ట్రం నుండి పూర్తి మద్దతు, వేగవంతమైన ఆమోదాలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించినట్లు మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రితో చాలా సానుకూలంగా చర్చ సాగినట్లు తెలిపారు.

**ఢిల్లీలో జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో**

# మంత్రి లోకేష్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఇందుకు సంబంధించి ఏవియేషన్ ఎడ్యుసిటీ మొత్తం అభివృద్ధి ప్రణాళికను ఈ సందర్భంగా ఖరారు చేశారు. ఈ ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. విశాఖ ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ద్వారా విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల విద్య, శిక్షణలకు హబ్ గా మారుతుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ ఛేంజర్ గా మారడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులు ఎస్జీకే కిషోర్, సి.ప్రసన్న, పీయుష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రేపే సాంస్కృతిక సంబరం.. కళల సౌరభం...

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్నాయి. నాటకాలు, గాత్ర సంగీతం, వాయిద్యం, జానపద సంగీతం, భక్తి, దేశభక్తి, నృత్యం, లలిత సంగీతం, క్విజ్, సాంప్రదాయ గిరిజన నృత్యం వంటి విభాగాల్లో ప్రతిభ చూపేందుకు చిన్నారులు ఉత్సాహం కనబరుస్తున్నారు.

**తరలివచ్చిన మినీ భారతం**

గిరిజన ప్రాంతాల పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశం. ఇది గిరిజన బిడ్డలకు దక్కిన అద్భుతమైన అవకాశం. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేందుకు దాదాపు 22 రాష్ట్రాల నుంచి 1800పైగా చిన్నారులు తరలివచ్చారు. డిసెంబర్ 3,4,5 తేదీలలో మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులు తమ ప్రతిభ చాటనున్నారు. మన రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది ప్రతిభావంతులు కూడా తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించేందుకు సమాయత్తమయ్యారు.

**తొలిరోజు కార్యక్రమాలివే..**

అంగరంగ వైభవంగా నిర్వహించనున్న 6వ జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎమ్ఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలకు కేంద్ర మంత్రులు సహా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఛైర్ పర్సన్ లు, ఐఏఎస్ లు పాల్గొననున్నారు. తొలిరోజు కార్యక్రమం.. ముందు అతిథులను వేదికపై ఆహ్వానించిన అనంతరం ప్రారంభ గీతంతో మొదలవుతుంది. గిరిజన శాఖకు చెందిన కార్యదర్శి, కమిషనర్ ల ప్రారంభోపన్యాసాలు ఉంటాయి. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రసంగిస్తారు. అనంతరం కేంద్ర మంత్రి ఓరమ్ కీలకోపన్యాసం ఉంటుంది. అనంతరం వేదికపైకి వచ్చిన అతిథులకు చిరుసన్మానం, పురస్కార ప్రదానం ఉంటుంది. ఆ తర్వాత మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలతో తొలిరోజు ఉత్సవం ముగుస్తుంది.

**ప్రత్యేకాకర్షణగా మస్కట్ 'క్రిష్'**

గిరిజన సంస్కృతి చాటే విధంగా, రాష్ట్ర జంతువు కృష్ణజింకను మస్కట్ గా ఎంపిక చేశారు. ఇప్పటికే 'క్రిష్'గా మస్కట్ పేరును ఖరారు చేశారు. శుక్రవారం నాడు సాయంత్రం 5గం.లకు ముగింపు వేడుకలు జరుగుతాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆఖరి రోజున ఘనంగా సన్మానించి, ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు.

# పవన్ కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దు : జనసేన

(మొదటిపేజీ తరువాయి)

జనసేన పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

పవన్ ఏమన్నారంటే?

ఇటీవల కోనసీమ జిల్లాలో దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించేందుకు అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.."గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం వీటి పచ్చదనమే. నిత్యం పచ్చగా ఉంటుందని తెలంగాణ నాయకులంతా అంటారు. ఇప్పుడు కొబ్బరికి దిష్టి తగిలినట్లుంది" అని పవన్ వ్యాఖ్యానించారు.

**అమరావతిలో రెండో విడత**

# భూసమీకరణకు ఆదేశాలు..

(మొదటిపేజీ తరువాయి)

పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా మరో గ్రామం కలిపి మొత్తం 7 గ్రామాల్లో 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్‌భూముల్ని సమీకరించాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూసమీకరణలో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది.

# తిరుమల వైకుంఠ ద్వార దర్శనం..

(మొదటిపేజీ తరువాయి)

తొలి 3 రోజులు రూ.300 దర్శనం, శ్రీవాణి దర్శనాలు రద్దు, ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా అన్ని రకాల సిఫార్సు దర్శనాలు రద్దు, వైకుంఠ ఏకాదశి రోజున 70వేల మందికి దర్శన ఏర్పాట్లు చేసిన తితిదే, గంటకు 4,300 మందికి దర్శనం చేయించేందుకు ఏర్పాట్లు, ఈనెల 30న (వైకుంఠ ఏకాదశి) 20 గంటల దర్శన సమయం, ఈనెల 30న సామాన్యులకు 15.15 గంటలు, వీఐపీలకు 4.45 గంటలు కేటాయింపు.

**సర్పంచ్‌లు మంచోళ్లు ఉంటేనే**

# గ్రామాలు అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయి. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండి" అని సీఎం విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్వ వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...







బుధవారం, 03 డిసెంబర్ 2025





www.viswamvoice.com


# జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రభావాన్ని అధిగమించిన ఏపీ

జీఎస్టీలో రెండవ తరం సంస్కరణలు అమలు చేయడం వల్ల దేశవ్యాప్తంగా అనేక వస్తువుల మీద స్లాబ్స్ తగ్గిపోయాయి. కొన్ని అయితే లేకుండా పోయాయి. దీంతో ఏపీకి ఏకంగా ఎనిమిది వేల కోట్ల రూపాయల దాకా తగ్గుదల కనిపిస్తుందని అంచనా వేశారు. అయితే ఈ సంస్కరణల తర్వాత చూసినా ఏపీలో జీఎస్టీ వసూళ్ళు బాగానే ఉన్నాయి. దాంతో దేశంలో ఏపీ మంచి ప్లేస్ ని సొంతం చేసుకుంది అని చెబుతున్నారు.

**వృద్ధి బాగానే :**

నిజానికి చూస్తే ఏపీకి ఈ సంస్కరణల వల్ల ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురవుతుందని అంతా అనుకున్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రభావాన్ని ఏపీ సమర్థవంతంగా ఎదుర్కొంది. 2025 నవంబర్ వరకు నికర జీఎస్టీ వసూళ్లలో చూస్తే కనుక 5.80 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ పురోగతి 2025 లో రాష్ట్రంలో పెరిగిన ఆర్థిక కార్యకలాపాలతో పాటు, పన్ను చెల్లింపుదారులలో కట్టుదిట్టంగా అనుసరించిన విధానం, కఠినమైన చర్యల అమలు వల్లనే సాధ్యపడింది అని చెబుతున్నారు.

**నవంబర్ లో మాత్రం :** ఇక ఒకసారి విశ్లేషిస్తే కనుక ఏపీ 2025 నవంబర్‌లో మాత్రం ఒక మోస్తరు జీఎస్టీ వసూళ్లను నమోదు చేసింది. దీనికి కారణం ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0 రేటు తగ్గింపుల వల్లనే అంటున్నారు. ప్రధానంగా దీని ప్రభావం




ఆటోమొబైల్, సిమెంట్, ఎఫ్ ఎం జీసీ, వినియోగదారుల ఎలక్ట్రానిక్స్, పాడి ఉత్పత్తులు ఇతర అంశాలపైన ఉంది. వీటి మీదనే రేట్లు తగ్గించారు. దాంతో 2025 నవంబర్ వసూళ్లు ప్రధానంగా 2025 అక్టోబర్ నెల వ్యాపార లావాదేవీలకు సంబంధించినవి కావడంతో కొంత మందకొడిగా ఉన్నాయని చెబుతున్నారు.

**లక్ష్యం చేరుకోవడం :** ఇక వివిధ విభాగాల వారీగా చూస్తే ఆదాయం తగ్గినా కట్టుదిట్టమైన అనుసరణ చర్యలతో బాగానే పెర్ఫార్మ్ చేసినట్లుగా ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇక రేట్ల తగ్గింపు కారణంగా పెరిగిన లావాదేవీలతో కూడా జీఎస్టీ వసూళ్ళు కొత్త నంబర్ చూశాయని అంటున్నారు. ఆ వాల్యూమ్ మొత్తం ఆదాయం లక్ష్యం లోని 74 శాతం చేరుకునేందుకు దోహదం చేశాయని వివరిస్తున్నారు. జీఎస్టీ ఆదాయం ఇలా : ఇక ఒక్కసారి గమనిస్తే 2025 నవంబర్‌లో నికర జీఎస్టీ వసూళ్లు 2,697 కోట్ల రూపాయలుగా ఉంది. ఇది సంవత్సరానికి పైగా చూస్తే కనుక 4.60 శాతం తగ్గుదలగా కనిపిస్తుంది. ఇక మొత్తం కమర్షియల్ టాక్స్ రెవెన్యూ 4,124 కోట్ల రూపాయలుగా ఉంది. ఇది సంవత్సరానికి పైగా చూస్తే 3.17 శాతం తగ్గుదలగా నమోదు అయింది. అయితే సంస్కరణల మార్పుల సమయంలో అమలు చేసిన చర్యలు రెవెన్యూ స్థిరత్వాన్ని బాగానే చూపిస్తున్నాయని అంటున్నారు.

**విభాగాల వారీగా చూస్తే :** ఇవన్నీ పక్కన పెడితే రాష్ట్ర జీఎస్టీ ఆదాయం 1,109.17 కోట్లుగా నమోదు అయింది. ఇది 2024 నవంబర్‌లోని 1,197.14 కోట్లతో పోలిస్తే 7.35 శాతం తగ్గుదలగా ఉంది. ఇది జీఎస్టీ 2.0 రేటు తగ్గింపుల కారణంగా సంభవించింది అని అధికారులు చెబుతున్నారు. ఆటోమొబైల్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్, పాల ఉత్పత్తులపై తక్కువ రేట్ల ప్రభావం వల్లనే మొత్తం ఆదాయం తగ్గిందని అంటున్నారు అదే సమయంలో నిలకడగా ఆదాయం ఉంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఈ డెబ్భై రోజులలలో ఎంతో ప్రభావం చూపించాయని అంటున్నారు. రానున్న కాలంలో తక్కువ రేట్ల మీద కూడా కొనుగోళ్ళు మరింతగా పెరిగి ఆదాయం ఇంకా పెద్ద ఎత్తున పెరిగేందుకు దోహదపడవచ్చు అని అంటున్నారు.

# జగన్ విమానాల ఖర్చు..

## రచ్చ రేపిన టీడీపీ సోషల్ మీడియా!



ఏపీ రాజకీయం నిత్యం మండుతున్న అగ్ని గుండంగానే ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక హాట్ టాపిక్ రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తూనే ఉంటోంది. తాజాగా, గత ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న విమాన ఖర్చులపై రచ్చ రాజుకుంటోంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ పర్యటనలకు విచ్చలవిడిగా విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారని, ఈ ముగ్గురు ప్రతివారం తమ ప్రైవేటు పర్యటన కోసం హైదరాబాద్ వస్తూ భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని గత కొంతకాలంగా వైసీపీ ప్రచారం చేస్తోంది. ప్రధానంగా వైసీపీ అధినేత జగన్ యాజమాన్యంలో ఉన్న సాక్షి పత్రికలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, లోకేశ్ పర్యటనల లెక్కలు చెబుతూ ప్రత్యేక కథనాలు ప్రచురిస్తోంది. ముఖ్యంగా మంత్రి లోకేశ్ పర్యటనలను టార్గెట్ చేస్తున్న వైసీపీ.. 77 సార్లు విమాన ప్రయాణాలు చేశారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని వైసీపీ సోషల్ మీడియా విరుచుకుపడుతోంది. దీనికి కౌంటరుగా రంగంలోకి దిగిన టీడీపీ సోషల్ మీడియా ఆర్టీసీ సమాచారం ద్వారా సేకరించిన ఆధారాలతో వైసీపీపై కౌంటరు అటాక్ చేస్తోంది. లోకేశ్ విమాన ప్రయాణాలపై ఓ ఆర్టీఐ కార్యకర్త సమాచారం అడిగితే.. మంత్రిగా లోకేశ్ విమాన ప్రయాణాలకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని సమాధానం వచ్చింది. లోకేశ్ రాష్ట్రమంత్రిగా ఉన్నప్పటికీ ఆయన అధికారిక కార్యక్రమానికి వెళ్లినా తన సొంత ఖర్చులతోనే ప్రయాణాలు చేస్తున్నారని వెల్లడైంది. వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నట్లు లోకేశ్ 77 విమాన టూర్లకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తీసుకోలేదని స్పష్టమైందని టీడీపీ కార్యకర్తలు చెబుతున్నారు. ఇక లోకేశ్ విమాన ఖర్చులు బయటపెట్టినట్లే.. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ విమాన ప్రయాణాలు, అందుకు అయిన డబ్బుపై ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించి కౌంటరుగా ట్రోలింగ్ మొదలుపెట్టింది. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో సుమారు రూ.222 కోట్ల రూపాయల ప్రజాధనంతో విమాన ప్రయాణాలు చేశారని టీడీపీ సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. ఆర్టీఐ ద్వారా తీసుకున్న సమాచారాన్ని ఆధారంగా చూపుతోంది. జగన్ ఐదేళ్లు సీఎంగా పనిచేయగా, ఎక్కడికి వెళ్లినా ప్రజాధనంతో హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో తిరిగారని, ఏడాదికి సరాసరి రూ.50 కోట్లు ఖర్చు చేశారని టీడీపీ చెబుతోంది. అంతేకాకుండా కరోనా కాలంలో కూడా జగన్ హెలికాప్టర్లలోనే విలాసంగా తిరిగారని ఆరోపిస్తోంది. ఇక ఆయన జల్సాల కోసం లండన్ వెళ్లగా, అప్పుడూ ప్రభుత్వ ధనాన్నే వినియోగించారని టీడీపీ విమర్శిస్తోంది. జగన్ నివాసం ఉన్న తాడేపల్లి నుంచి పక్కనే ఉన్న గుంటూరు వెళ్లాలన్నా హెలికాప్టర్ వినియోగించడాన్ని ఎత్తిచూపుతోంది. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య విమాన ప్రయాణాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఇంతవరకు మంత్రి లోకేశ్ ప్రయాణాలపై దాడి చేసిన వైసీపీ సోషల్ మీడియా.. టీడీపీ కౌంటర్ అటాక్ చేసిన తర్వాత స్లో అయినట్లు కనిపిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనలపై ప్రభుత్వం, టీడీపీ మీడియా అటాక్ పెంచిన తర్వాత వైసీపీ డైలమాలో పడిపోయిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనప్పటికీ ఈ డిబేట్ రాష్ట్ర రాజకీయాలను మరోసారి వేడెక్కించిందని అంటున్నారు.

# ఎన్నికలు లేకుంటే.. 'పవన్' చర్చ వచ్చేదా?

తెలంగాణలో మరోసారి అస్తిత్వ పోరాటం ప్రారంభమైంది. తమ రాష్ట్రాన్ని.. అవమానించారంటూ.. పలువురు నాయకులు.. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై విరుచుకుపడుతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేతో ప్రారంభమైన ఈ వివాదం.. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి వరకు చేరింది. ఏకంగా పవన్ ను క్షమాపణలు చెప్పాలంటూ.. కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. అంతేకాదు.. అలా చెప్పకపోతే.. ఒకటో రెండో రోజులు ఆడే పవన్ సినిమాలు అసలు విడుదలకు కూడా నోచుకోవని ఆయన హెచ్చరించారు. తక్షణమే ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. ఇక, ఆవు చేలో మేస్తే.. అన్న చందంగా.. పెద్ద నేతలే.. ఈ చిన్న విషయంలో జోక్యం చేసుకుంటే మిగిలిన నాయకులు ఊరుకుం టారా? అన్నట్టుగా చెట్టు కొకరు పుట్టకొకరు అన్నట్టుగా నిన్న మొన్నటి వరకు ఉన్న నాయకులు పవన్‌కల్యాణ్ పుణ్యమా అని.. ఇప్పుడు మీడియా ముందుకు వస్తున్నారు. చిత్రం ఏంటంటే.. తెలంగాణ గురించి ఎవరైనా ఏమైనా అంటే.. ఒకప్పుడు నిప్పులు చెరిగిన బీఆర్ ఎస్ పార్టీ నాయకులు పవన్‌కల్యాణ్ విషయంలో మౌనంగా ఉంటే.. కాంగ్రెస్ నాయకులు మాత్రం వకాల్తా పుచ్చుకున్నట్టుగా ఈ విషయంలో కామెంట్లు కుమ్మరిస్తున్నారు. ఇక, ఈ వ్యవహారంపై రాజకీయ చర్చ కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు ఉన్నందునే.. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కాంగ్రెస్‌నేతలు పెద్దవి చేస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు. నిజానికి పవన్ చేసిన వ్యాఖ్యలను పెద్దవి చేసి చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. గతంలో తెలంగాణ కవులు.. కాళోజీ నారాయణరావు వంటివారిని పవన్ పబ్లిక్‌గా కొనియాడారని.. అదేవిధంగా కొమరం భీమ్ వంటి వారిని వేనోళ్ల కొనియాడిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అంతేకాదు.. అధికారంలో లేనప్పుడు.. కాకినాడ సభలో పవన్ చేసిన వ్యాఖ్యలను కూడా గుర్తు చేస్తున్నారు. "తెలంగాణ ప్రజలకు గుండె ధైర్యం,పౌరుషం



ఎక్కువ.. ఇక్కడి(ఏపీ) వారికి అవి ఉంటే.. " అంటూ ప్రత్యేక హోదాపై చేసిన వ్యాఖ్యలు మరిచిపోయారా? అని విశ్లేషకులు తెలంగాణ వారిని ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా.. ప్రస్తుతం తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సమరం కొనసాగుతున్న నేపథ్యంలో అస్తిత్వాన్ని పార్టీలకు అనుకూలంగా మార్చుకునేందుకు.. ప్రజల భావోద్వేగాలను ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్న వాదనను పరిశీలకులు చెబుతున్నారు. అయినా.. కోనసీమ కొబ్బరి చెట్లకు ప్రత్యేక తెలంగాణకు పవన్ కల్యాణ్ ముడి పెట్టలేదని.. మాట వరసగానే అన్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

# వంశీ అనుచరుల కోసం మొదలైన వేట..

## ఆ నలుగురి కోసం రంగంలోకి పోలీసులు



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల కోసం పోలీసులు వేటాడుతున్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నిందితులైన వంశీ అనుచరులు గత పది నెలలుగా పరారీలో ఉన్నారు. మొత్తం ఆరుగురు నిందితులు పరారీలో ఉంటే.. వారిపై నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. దీంతో ఇద్దరు నిందితులు తమపై వారెంట్లను రీకాల్ చేయించుకోడానికి సోమవారం కోర్టుకు రాగా, వారిని రిమాండుకు పంపిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు చేశారు. దీంతో ఇంకా పరారీలో ఉన్న మరో నలుగురు నిందితులు టెన్షన్ మొదలైందని అంటున్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసును వెనక్కి తీసుకోమని బెదిరిస్తూ ముదునూరి సత్యవర్ధన్ ను నిందితులు కిడ్నాప్ చేశారని ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదైంది. హైదరాబాదులో ఉన్న సత్యవర్ధన్ ను విజయవాడ రప్పించి కిడ్నాప్ చేశారని, బాధితుడు సత్యవర్ధన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ కేసును ప్రభుత్వం సీరియసుగా తీసుకోవడంతో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతోపాటు ఆయన అనుచరులైన కొమ్మా కోటేశ్వరరావు, తేలప్రోలు రాము, వజ్రకుమార్, ఎర్రంశెట్టి రామాంజనేయులు, చేబ్రోలు శ్రీనివాసరావు, వేణును నిందితులుగా గుర్తించింది. నిందితుల్లో వంశీని అప్పట్లోనే అరెస్టు చేశారు. ఈ కేసు రాష్ట్రంలో పెను సంచలనమైంది. ఇక వంశీ అరెస్టు తర్వాత ఆయన ప్రధాన అనుచరులు ఆరుగురు పరార్ అయ్యారు. వీళ్లంతా గత పది నెలలుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నారు. వారి అరెస్టుపై ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరగడంతో ఇటీవల నిందితులపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. వంశీ అరెస్టు తర్వాత ఇళ్లను వదిలి వెళ్లిపోయిన ఆరుగురు నిందితులు ముందస్తు బెయిలు కోసం తెగ ప్రయత్నాలు చేశారు. అయితే, వారి ప్రయత్నాలు ఏవీ ఫలించకపోగా, నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీతో అరెస్టు తప్పనిసరి పరిస్థితి ఎదురైందని అంటున్నారు. దీంతో అరెస్టు తప్పదని భావించిన నిందితులు తేలప్రోలు రాము, వజ్రకుమార్ వారెంట్ రీకాల్ చేయించుకోవడానికి సోమవారం కోర్టుకు హాజరయ్యారు. వీరి పిటిషన్ ను పరిగణనలోకి తీసుకోని న్యాయాధికారి భాస్కరరావు 15 రోజుల రిమాండ్ విధిస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చారు. దీంతో మిగిలిన నిందితుల్లో టెన్షన్ ఎక్కువైంది. ప్రస్తుతం ఇద్దరికి రిమాండ్ పడటంతో మిగిలిన నలుగురి ఆచూకీ కోసం పోలీసులు రంగంలోకి దిగారు. వంశీని అరెస్టు చేయించిన ప్రభుత్వం తమ విషయంలో మెతక వైఖరి అవలంబిస్తుందని ఇన్నాళ్లు నిందితులు ఎదురుచూశారని అంటున్నారు. అయితే వంశీని ఏ విధంగా ట్రీట్ చేశారో.. ఆయనకు కొమ్ముకాసిన వారికి అదేవిధమైన ట్రీట్మెంట్ ఉంటుందని ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం అందడంతో నిందితులు ముందస్తు బెయిలు ప్రయత్నాలు చేస్తూ వచ్చారని చెబుతున్నారు. అయితే ఈ విషయంలోనూ ప్రభుత్వ అధికారుల సహకారం అవసరం ఉండటంతో నిందితులకు ఉపశమనం దక్కలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ కావడంతో నిందితులు స్వచ్ఛందంగా లొంగిపోవడం ఒక్కటే మార్గం కనిపిస్తోందని న్యాయవాద వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

# చంద్రబాబు పాత్రలోకి లోకేశ్.. ఢిల్లీలో యువనేత హడావుడి



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వారసుడు, యువ మంత్రి నారా లోకేశ్ ప్రభావం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానంలో సంపూర్ణంగా ఆయన బాధ్యతలను యువనేత లోకేశ్ భుజానకెత్తుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్లాల్సిన కార్యక్రమాలకు సైతం లోకేశ్ హాజరవుతూ.. భవిష్యత్తుపై ఢిల్లీ స్థాయిలో సంకేతాలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొంథా తుఫాన్ నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతోపాటు పలు ప్రాజెక్టులపై మంత్రి లోకేశ్ ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న వేళ.. ఆయన ఢిల్లీలో అడుగుపెట్టడం, ఎంపీలు అందరితో సమావేశమై కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై సమీక్షించడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ఏపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉంటూనే లోకేశ్ 'ముఖ్య'పాత్ర పోషించడం ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు కేబినెట్ లోని మంత్రులకు సీఎం హోదాలో ఆయనే నాయకత్వం వహించాల్సివుంటుంది. కానీ, గత కొన్ని నెలలుగా ఈ పద్ధతిలో మార్పు కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ పర్యటనలు లేదా పెట్టుబడుల కోసం పారిశ్రామిక వేత్తలను కలుస్తున్న మంత్రుల బృందానికి లోకేశ్ నాయకత్వం వహిస్తున్నారు. ఇది ప్రభుత్వంలో ఆయన ప్రాధాన్యాన్ని తెలియజేస్తోందని అంటున్నారు. సహజంగా ఇలాంటి పర్యటనలకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమే నాయకత్వం వహించేవారు. కానీ, ఇప్పుడు ఆయన ఎక్కువగా రాష్ట్రంలోనే ఉండటానికి ఇష్టపడుతున్నారు. తన బదులుగా మంత్రి లోకేశ్ ను పంపిస్తున్నారు. ఇదంతా గమనిస్తున్న వారు ముఖ్యమంత్రిగా లోకేశ్ కు బాధ్యతలు బదిలీ చేసే ముందు తగిన శిక్షణ ఇవ్వడమేనా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నుంచి పాలన అనుభవం నేర్చుకోవడం లోకేశ్ భవిష్యత్తుగా ఉపయోగపడుతుందన్న అలోచనతోనే.. ఆయనను ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ఇటు పార్టీ.. అటు ప్రభుత్వ వ్యవహారాలలో ఇటీవల లోకేశ్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి తాజాగా ఢిల్లీ పర్యటన మరో అదనపు ఉదాహరణగా వ్యాఖ్యానిస్తున్నారు. వరుస పర్యటనలు, ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రులతో లోకేశ్ కొనసాగిస్తున్న సంబంధాలు వల్ల కేంద్ర ప్రభుత్వంలో కూడా ఆయన పరపతి పెరుగుతోందని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు 4.0 ప్రభుత్వంలో ఢిల్లీ పర్యటనలకు ఎక్కువగా లోకేశ్ మాత్రమే వెళుతున్నారు. ముఖ్యమంత్రి తరఫున ఆయనే ప్రధాని, కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం లోకేశ్ స్పీడుకు ఫిదా అవుతున్నట్లు చెబుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లోకేశ్ ను ఢిల్లీకి ప్రత్యేకంగా పిలిపించుకున్న ప్రధాని మోదీ.. ఆయనతో సుమారు గంట పాటు చర్చించిన తర్వాత మళ్లీ మళ్లీ రమ్మంటూ పిలిపించడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రధానితో లోకేశ్ భేటీ అయిన తర్వాతే ఏపీకి పలు అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు తరలివచ్చాయి. ఇందులో గూగుల్, అర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలు ఒక శాంపిల్ గా చూపుతున్నారు. తాజా పర్యటనలో సైతం లోకేశ్ తన బృందంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ ఇద్దరు కూడా కేంద్ర ప్రభుత్వంలో అత్యంత సీనియర్లు కావడం గమనార్హం. ఇక కేంద్ర పెద్దలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న మంత్రి లోకేశ్.. అటు ఆర్ఎస్ఎస్ పెద్దలను ఆకర్షిస్తున్నారు. ఇటీవల మంత్రి లోకేశ్ తో ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్‌లాల్‌జీ భేటీ అయ్యారు. ఈయన గతంలో బీజేపీ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. త్వరలో జరిగే ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించేందుకు రామ్‌లాల్‌జీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రముఖులను కలుస్తున్నారు. ఇలా ఆర్ఎస్ఎస్ ప్రముఖుల జాబితాలో లోకేశ్ పేరు కూడా చేర్చడమే ఆసక్తికరంగా చెబుతున్నారు. ఇది లోకేశ్ సమర్థతకు బీజేపీ మాతృ సంస్థ ఇచ్చిన గుర్తింపుగా వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి లోకేశ్ అన్ని విధాలుగా, అందరి వైపు నుంచి పరిపూర్ణమైన మద్దతు కూడగట్టుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు.

# రాజవొమ్మంగిలో వైసీపీ పార్టీకి బిగ్ షాక్

## టిడిపిలోకి "క్యూ" కడుతున్న వైసిపి నేతలు, కార్యకర్తలు

### ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరిక



**రాజవొమ్మంగి, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం నియోజవర్గంలో వైసీపీలో నుండి పలువురు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో తెదేపాతీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని చెరుకుంపాలెంలో పార్టీ నియోజకవర్గం పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, ఏపీఐఐసి డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు సౌజన్యంలో మంగళవారం పార్టీలో చేరిన వారి విషయమై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శిరీషదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన, రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న సంస్కరణలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమాల్లో కూటమి సర్కార్ పరుగులు పెట్టిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్న విధానానికి ఆకర్షితులై పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ఇప్పటికే పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు. రాజవొమ్మంగి మండలం నుండి తెదేపా తీర్థం పుచ్చుకున్న వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెరుకుంపాలెం పంచాయతీలో వైఎస్సార్ సీపీ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు నచ్చి సుమారు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీకండువాలు కప్పుకున్నారు. తెదేపా తీర్థం స్వీకరించిన వారిలో సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు మడకం కమలాదేవి, కొప్పిశెట్టి వీరబాబు, యల్లపు వెంకన్న, చింతలపూడి సత్యవతి, బర్నికల శ్రీను, పూసం సత్తిబాబు, పాడుగు లక్ష్మీ, కొడవలి రాజు, పొత్తూరి గణపతి, మిరియాల మల్లేశ్వరరావు, మిరియాల సత్తిబాబు, కుంజం బాలరాజు, కుంజం నాగేష్, బర్నికల అప్పన్న తదితర 100 కుటుంబాలు పార్టీలో జాయిన్ అవగా ఆమె ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సీనియర్ నాయకులు గణజాల తాతారావ్, ఎంపిటిసి మీనవల్లి సుబ్బారావు, ఎంపిటిసి నల్లా సత్తిబాబు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, పార్టీ నాయకులు జెట్టి మధు, సూరిశెట్టి సురేష్, తమదాల సత్యనారాయణ, ఎఎంసి డైరెక్టర్ గట్టి మాణిక్యం, తెలుగు యువత నాయకులు బారంగి అనుదీప్, కంటపురెడ్డి వీరబాబు, చలుమర్తి బన్ను, చెక్కా లోవరాజు, విసంశెట్టి సత్తిబాబు, వానపల్లి చిట్టిబాబు, తేజ, రెడ్డి రమణ, గొర్లె సీతాంబరం, ముర్ల వీరబాబు, ఎలిసెట్టి భద్రం, కోటంశెట్టి సత్తిబాబు, ముప్పన మోహన్, పల్లాల బాలురెడ్డి, పీరు వీరభద్రరావు, చలుమర్తి దుర్గాప్రసాద్, పడాల కాటమస్వామి, షేక్ బాజీ, వరదా సత్తిబాబు, కుంజం అబ్బాయిదొర, నందా రాంబాబు, బొడ్డు దుర్గాప్రసాద్, బొడ్డు వెంకన్న, మీనవల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# గోపవరం గ్రామంలో స్పాపౌజ్ పింఛన్ పంపిణీ

## విద్యార్థులతో ముచ్చటించిన ఎంపిటిసి - వంశీ కుంజాం





**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం మండలం తామరపల్లి పంచాయతీలోని గోపవరం సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి, ముసురుమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం పింఛను పంపిణి కార్యక్రమలో పాల్గొనడం జరిగింది. ఎంపిటిసి వంశీ కుంజాం పింఛనదారులతో మాట్లాడుతూ ప్రతి నెల మీకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా మీ ఇంటి వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది పింఛను ఇవ్వడం జరుగుతుందాని తెలియజేసారు. పింఛను కార్యక్రమనంతరం సమీపంలోని పాఠశాలను సందర్శించారు పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, ఆరోగ్య భద్రత విషయాలను తెలుసుకున్నారు. ఆహారం మెనూ ప్రకారం విద్యార్థులకు అన్ని అందుతున్నాయో లేదో అడిగితెలుసుకున్నారు. వారం రోజుల నుండి మెనూలోని గుడ్డు పెట్టడం లేదని విద్యార్థులు తెలపగలగ.. సంభంధిత ఉపాధ్యాయులను ప్రశ్నించడం జరిగింది. అందవలసిన స్టాక్ రాలేదని, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. సకాలంలో పిల్లలకు పెట్టె మెనూ ప్రకారం ఆహారంలో ఇంత ఆలస్యం ఉండకూడదని, ఉన్నత అధికారులతో మాట్లాడతానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిర్తి వాడ ఆనంద రెడ్డి, ఎంపిటిసి కుంజాం వంశీ, వార్డ్ మెంబెర్స్ గంగా, ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరయమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాలొగొన్నారు.

# డీజీపీ హరీష్ కుమార్ గుప్తాని కలిసిన ఎమ్మెల్యే బత్తుల

## పోలీస్ భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వండి - డీజీపీకి వినతులు చేసిన బత్తుల



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సీతానగరం మరియు కోరుకొండ పోలీస్ స్టేషన్లు, కోరుకొండ సర్కిల్ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలి. డీఎస్పీ నార్త్ జోన్ కార్యాలయాలకు కోరుకొండలో కొత్త భవనాలు నిర్మించాలి. కోరుకొండ సర్కిల్ కింద ఉన్న సీతానగరం, కోరుకొండ పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలు లేక ప్రైవేటు భవనాల్లో ఉన్నాయి. కోరుకొండ పోలీస్ స్టేషన్ రైతు సేవా కేంద్రంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. డి.ఎస్.పి నార్త్ జోన్ కార్యాలయం సొంత భవనం లేకపోవడం వలన ప్రైవేటు ప్రాంగణంలో పనిచేస్తుంది. ఈ భవనాల నిర్మాణాలకు తగిన విధంగా భూమి సేకరించి భవనాలు నిర్మించాలని ఆయన కోరారు.

**పోలీసులకు వాహనాలు సమకూర్చండి:**

రాజనగరం నియోజకవర్గంలోని రాజనగరం మరియు కోరుకొండ సర్కిల్‌లను కలిగి ఉన్న మూడు పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలను మంజూరు చేయాలనీ కోరారు. ఈ స్టేషన్లకు కేటాయించిన ప్రస్తుత వాహనాలు తరచూ రిపేర్‌లతో మూలన పడిఉన్నాయి. కాబట్టి వెంటనే వాహనాలను మంజూరు చేయాలనీ కోరారు. ఇద్దరు సర్కిల్‌ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సి ఐ లు) కోసం రెండు కొత్త వాహనాలు మరియు మూడు పోలీస్ స్టేషన్‌ల సబ్ ఇన్‌స్పెక్టర్ల (ఎస్ ఐలు) కోసం మూడు కొత్త వాహనాలను మంజూరు చేయాలని కోరారు. పై విషయలపై సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా త్వరి తగతిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# చింతూరు జిసిసి ముందు కార్మికుల ధర్నా

## హమాలీ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి : సీఐటీయూ



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మన్యం జిల్లాలో జిసిసి హమాలి కార్మికులకు రెండు నెలలుగా చేస్తున్న పనికి రావలసిన వేతన బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో చింతూరు జిసిసి కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ లు మాట్లాడుతూ జిసిసి పరిధి నుండి హమాలి కార్మికులను సివిల్ సప్లై పరిధిలోకి తీసుకురావడం జరిగిందని, జిసిసిగా నిర్వహణ ఉన్న సందర్భంగా వారానికి ఒకసారి పేమెంట్ ఇచ్చేవారని, కానీ సివిల్ సప్లై లోకి మార్పు చెందిన తర్వాత రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు పోషించుకోవడం కష్టతరంగా మారిందని అన్నారు. సివిల్ సప్లై అధికారులు గడిచిన సోమవారం నాటికే పేమెంట్ క్లియర్ చేస్తామని చెప్పి మాట ఇచ్చి తప్పారని విమర్శించారు. చింతూరు పాయింట్లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు 5 లక్షల రూపాయలు పెండింగ్లో ఉన్నదని, తక్షణమే హమాలీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని అధికారులను డిమాండ్ చేశారు. చెయ్యలేని లేనిపక్షంలో పోరాటం తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు అయ్యప్ప స్వామి, రాఘవయ్య, బిస్మారావు, మంగరాజు, రాజయ్య, చంద్రయ్య, చిట్టిబాబు, భద్రయ్య, రామారావు, రాముడు, రాంబాబు, సుబ్బారావు, నాగు, ముత్తయ్య, సీతారామయ్య, నాగార్జున, రమేషు, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, సంతోషం, సంపాదన ఉంటే అనారోగ్యాలు దరిచేరవు

## క్యాన్సర్‌పై డాక్టర్ పృద్వీచే ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లకు అవగాహన సదస్సు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం రాజమహేంద్రి మహిళా డిగ్రీ మరియు పీ.జీ. కళాశాల ఆధ్వర్యంలో స్థానిక రాజా థియేటర్ మున్సిపల్ కాలనీ సమీపంలో ఉన్న రత్నంపేట లో జరుగుతున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఆరవ రోజులో భాగంగా ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లకు క్యాన్సర్ వ్యాధిపై కాకినాడ మెడికేర్ హాస్పిటల్ నుంచి వచ్చిన డాక్టర్ పృద్వి అవగాహన కల్పించారు. డాక్టర్ పృద్వి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్యం, సంతోషం మరియు సంపాదన ఉంటే మనకి ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని అన్నారు. ముఖ్యంగా ఆడవారిలో రెండు రకాల క్యాన్సర్లు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని మొదటిగా రొమ్ము క్యాన్సర్, రెండవది గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. రొమ్ము క్యాన్సర్ ని స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవడం వల్ల మనం ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని, అలాగే గర్భసంచి ముఖద్వారం క్యాన్సర్ నానోగ్రఫీ టెస్ట్ ద్వారా తెలుసుకొని దానికి వ్యాక్సిన్ తీసుకుంటే ఆ వ్యాధిని ముందుగానే మనం పూర్తిగా నిర్మూలించవచ్చునని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.కే.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి మన ఎన్.ఎస్.ఎస్. శిబిరానికి విచ్చేసి క్యాన్సర్ గురించి మనందరికీ అర్థమయ్యే రీతిలో మంచిగా వివరించిన డాక్టర్ పృథ్వికి కృతజ్ఞతలు తెలుపుతూ ముందుగా మనకు ఎవరైనా ఏమైనా చెప్తే దానిని శ్రద్ధగా విని తర్వాత దానిని మనం ఆచరించి ఇతరులు ఆచరించేలా చూడాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. పి.ఓ దంటు వీర వెంకట్రావు, మాజీ పీ.వో. లక్ష్మీ ప్రవీణ, ఎన్.ఎస్.ఎస్. క్లర్క్ మౌనిక, శాంతి, సురేష్, కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక యుటిఎఫ్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**కూనవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన్యంజిల్లా కూనవరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ మర్రిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ జ్ఞానం విజ్ఞాన వేదిక యూటిఎఫ్ ఎఫ్. వేదిక ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జానవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. డిశంబర్ 2025న జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తు చేసుకున్న జిల్లా పరిషత్ హై స్కూల్ కూనవరం, మర్రిగూడెం పాఠశాలలో 8వ తరగతి చదుతున్న పేద విద్యార్థులను, చదువులో వెనకబడిన విద్యార్థులకు ఈ మెటీరియల్ ఉపయోగపడుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూనవరం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అప్పారావు, రాంబాబు, సుబ్బారావు, చందు, శేఖర్ మర్రిగూడెం పాఠశాల ఉపాధ్యాయులు కామేష్, శాంతి,రాధా తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి

## ఆదివాసీలకు న్యాయం చేయండి



**అడ్డతిగల, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఆదివాసి సంక్షేమ పరిషత్ అడ్డతీగల, రాజవొమ్మంగి మండల కార్యకర్తలతో తిమ్మాపురం గ్రామంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ అడ్డతీగల, రాజవొమ్మంగి మండల పరిధిలో ఆదివాసి భూములు విచ్చలవిడిగా కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. ఆదివాసుల నుండి తమ సంఘానికి భారీ ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని మైదాన ప్రాంతాల నుండి ఏజెన్సీ ప్రాంతాలకు వలసలు వస్తున్న నాన్ ట్రైబల్స్ ఆదివాసి భూములను కబ్జా చేసి ఆదివాసులను భయభ్రాంతులకు గురి చేస్తూ తప్పుడు మార్గంలో పట్టాలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో అసలు రెవెన్యూ అధికారులు నాన్ ట్రైబల్స్ కి పట్టాలు ఏ విధంగా మంజూరు చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల కొరకు చేస్తున్న భూ సేకరణ లో పూర్వ నుంచి ఆదివాసి సాగులో ఉన్న భూములను నాన్ ట్రైబల్స్ తప్పుడు మార్గంలో పట్టాలు చేయించుకొని పోలవరం నిర్వాసితుల కొరకు కొనసాగుతున్న భూసేకరణలో అమ్మకానికి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు నాన్ ట్రైబల్స్ నుండి ఎటువంటి భూములు కొనుగోలు చేయవద్దని, అవన్నీ కూడా ఆదివాసి భూములేనని వాటిని కబ్జా చేసి తప్పుడు మార్గంలో అమ్మకాలకు పెడుతున్నారని ఆయన అన్నారు. అమాయక ఆదివాసులను నమ్మబలికి కౌలు పేరుతోటి కొన్నాళ్లు సాగు చేసుకుంటూ, నాన్ ట్రైబల్స్ అదే అదునుగా చేసుకొని తప్పుడు మార్గంలో సంతకాలు చేయించుకొని ఆదివాసులే భూములు అమ్ముకున్నట్లుగా అగ్రిమెంట్ పత్రాలు సృష్టిస్తున్నారని, అయినా 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో భూ బద్దలాయింపులు నిషేధమని ఆయన అన్నారు. ఆదివాసి భూములు కబ్జా చేసుకుని పోలవరం భూసేకరణకు అమ్ముకుంటున్న నాన్ ట్రైబల్స్ పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పోలవరం భూసేకరణ కోసం నాన్ ట్రైబల్స్ ఎక్కడైతే ప్రభుత్వ భూములను కబ్జా చేసి వ్యవసాయం చేస్తున్నారో వాటిని స్వాధీనం చేసుకోవాలని అలాంటి భూములను పోలవరం నిర్వాసితుల కొరకు ప్రభుత్వ అధికారులు ఉపయోగించుకోవాలని నాన్ ట్రైబల్స్ కబ్జాలో ఉన్న ఆదివాసి భూములను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని ఆయన ఈ సందర్భంగా అధికారులను ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను,ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, అడ్డతీగల మండల అధ్యక్షురాలు కారు అరుణ కుమారి. అడ్డతీగల, రాజవొమ్మంగి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

## - బీఎంపీల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎయిడ్స్ వ్యాధిపట్ల నేటి యువత అప్రమత్తంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం నగరశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు లంక సత్యనారాయణ,రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆకాశం గౌరీష్ బాబు విచ్చేసి ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని వివరించారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సానుభూతి చూపిద్దాం అనే నినాదాలతో వారు చక్కని సందేశాన్ని ప్రజలకు తెలియజేస్తూ నేటి యువత ఈ వ్యాధి పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ ఉపాధ్యక్షులు భోగి శ్రీనివాస్, సీనియర్ ప్రాక్టీషనర్ వి.రామకృష్ణ, బి.ప్రవీణ్, కుమార్, బి.ఎస్.వి.యు.మహేష్, కె.రామచంద్రరావు, ఎన్.వెంకటేశ్వరరావు, పి.రామలక్ష్మి రత్నకుమారి పాల్గొన్నారని నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శి,కోశాధికారి వి.బాలకృష్ణ, వి.వి.ప్రసాద్ బాబు, వి.శివశంకర్ (జగదీష్) ఒక ప్రకటనలో తెలియజేశారు.

టెక్ స్పార్క్ టెక్నికల్ ప్రాజెక్ట్‌లపై

# ఎంసీఏ విద్యార్థులు అవగాహన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఎంసీఏ విద్యార్థులు టెక్ స్పార్క్ పేరిట టెక్నికల్ ప్రాజెక్ట్‌ను తయారుచేసి విద్యార్థులకు వాటి గూర్చి క్లుప్తంగా వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వెబ్సైట్ క్రియేషన్, ఆన్లైన్ బ్యాంకు లోన్ సిస్టం, మెడికల్ స్టోర్, ఆన్లైన్ ఓటిటి ప్లాట్ఫారం క్రియేషన్, ఈ కామర్స్ వెబ్సైట్, రెస్టారెంట్ మేనేజ్మెంట్ సిస్టం, హెల్త్ కేర్ మేనేజ్మెంట్ సిస్టం, అనిమల్ డిటెక్షన్, ఏఐ ఫేస్ రికగ్నిషన్, మ్యూజిక్ బేస్డ్ ఎమోజీ డిటెక్షన్, డైస్ గేమ్ యూజింగ్ సి లాంగ్వేజ్, క్విజ్ నోవా, లాజిక్ లాక్స్, హ్యాక్ ద సిస్టం, పిపిటి ప్రజెంటేషన్, సైబర్ సెక్యూరిటీ మొదలగు ప్రాజెక్టులను తయారు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ఎంసీఏ విద్యార్థిని విద్యార్థులు డిగ్రీ బిసిఎ, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బీబీఏ మొదలగు విద్యార్థులకు వీటి మీద పూర్తి అవగాహనను కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇటువంటి ప్రాజెక్ట్స్ వల్ల విద్యార్థులు అనేక నూతన విషయాలను తెలుసుకునే వీలు ఉంటుందని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఇన్ సుగుణ రెడ్డి,డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు, కంప్యూటర్ విభాగాధిపతి జి.హేమ సుందర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల విస్తృత తనిఖీలు



## చింతూరు - భద్రాచలం రూట్ ముసివేత

**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు మండలంలోని చట్టి రహదారి కూడలి వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. చింతూరు సబ్ ఇన్స్పెక్టర్ మావోయిస్టు వారోత్సవాల కారణంగా వారం రోజుల పాటు 2వ తేదీ నుండి 8 వ తారీఖు వరకు చింతూరు నుండి భద్రాచలం వెళ్లే వాహనాలను రాత్రి 6నుండి ఉదయం 6గంటల వరకు కూనవారం మీదుగా దారి మళ్లీస్తున్నట్లు తెలియజేసారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ప్రజల భద్రత దృశ్య ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చింతూరు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎస్ఐ రమేష్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
బుధవారం, 03 డిసెంబర్ 2025
www.viswamvoice.com





### రేపు తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో

# సీఎం చంద్రబాబు పర్యటన

### నల్లజర్లలో "రైతన్నా... మీ కోసం" వర్క్ షాప్ లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

### విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి హాజరు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు తూర్పు గోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. బుధవారం జరగనున్న రెండు కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రేపు ఉదయం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో జరగనున్న "రైతన్నా... మీ కోసం" వర్క్ షాప్ లో పాల్గొననున్నారు. గత నెల 24వ తేదీ నుంచి 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా "రైతన్నా... మీ కోసం" పేరుతో రైతుల ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇంటింటా చేసిన ప్రచారంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలను ప్రచారం చేశారు. అలాగే సీఎం చంద్రబాబు రాసిన లేఖను ప్రతి రైతు ఇంటికి వెళ్లి ఈ ప్రచారంలో క్షేత్ర స్థాయి అధికారులు మొదలుకుని ఉన్నతాధికారులు, అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా "రైతన్నా... మీ కోసం" వర్క్ షాప్ నిర్వహించనున్నారు. నల్లజర్లలో జరగనున్న వర్క్ షాప్ కు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి నల్లజర్లకు బయలుదేరతారు. 10.55 గంటలకు నల్లజర్లకు చేరుకుంటారు. స్థానికంగా ఉన్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం వర్క్ షాప్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన "రైతన్నా... మీ కోసం"స్టాళ్లను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 11.50 గంటలకు ప్రజావేదిక సభలో రైతులు, రైతు కుటుంబాలతో ముఖ్యమంత్రి ముఖాముఖి అయ్యి ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 01.45 గంటల నుంచి 03.15 గంటల వరకు కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొనున్నారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం చేరుకుని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.



# యోగి మాదిరిగా చంద్రబాబు..

### నెల్లూరు ఎపిసోడ్ చెబుతోంది ఇదేనా..?



ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అరాచక శక్తుల పాలిట సింహస్వప్నంలా పనిచేస్తోందని అంటున్నారు. ముఖ్యంగా రౌడీలు, గ్యాంగస్టర్ల విషయంలో యూపీలో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ మాదిరిగా చంద్రబాబు యాక్షన్ ఉంటోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలోకి రాగానే గంజాయి ముఠాలు ఆటకట్టేలా చర్యలు తీసుకున్న చంద్రబాబు.. ఇంకా అక్కడక్కడ అరాచకంగా ప్రవర్తిస్తున్న వారి తాట తీసేలా అడుగులు వేయడమే సంచలనం రేపుతోంది. ఇక మహిళలు, ఆడపిల్లల జోలికి వెళ్లేవారికి అదే చివరి రోజు అవుతుందన్న చంద్రబాబు వార్నింగు అమలు అవుతోన్న పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. తాజాగా నెల్లూరులో గంజాయి డాన్ అరవి కామక్షికి చెందిన ఐదు ఇళ్లు కూల్చివేత పెను సంచలనంగా మారింది. ప్రజల రక్తాన్ని పీల్చి కామక్షి కట్టుకున్న ఇల్లు అర్ధరాత్రి కుప్పకూలిపోయింది. ఈ సంఘటన ద్వారా అరాచకశక్తులకు రాష్ట్రంలో స్థానం లేదన్న సంకేతాలు పంపినట్లు అయిందని అంటున్నారు. ఒక్క కామాక్షే కాదు చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దోపిడీ, దౌర్జన్యాలు, ఆడవాళ్లపై ఆకృత్యాలకు ఒడిగట్టేవారిపై వెనువెంటనే శిక్షలు పడుతున్నాయని చెబుతున్నారు. తునిలో ఓ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన 60 ఏళ్ల వృద్ధుడు చెరువులో శవంగా తేలడం కూడా ఇందులో భాగంగానే చెబుతున్నారు. ప్రజల క్షేమాన్ని కోరుతూ చంద్రబాబు సర్కారు తీసుకుంటున్న చర్యలను గమనిస్తున్నవారు ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంతో పోల్చుతున్నారు. యూపీలో సీఎం అయిన వెంటనే యోగి తీసుకున్న అనేక చర్యలు ఆ రాష్ట్రంలో అరాచక శక్తులను అణచివేసినట్లు చెబుతున్నారు. అయితే ఏపీలో యూపీ అంతలా పరిస్థితులు లేకపోయినా, ప్రమాదకరంగా మారిన గంజాయి ముఠాలు, బ్లేడ్ బ్యాచులు, ఆడపిల్లలపై ఆకృత్యాలకు ఒడిగట్టేవారిపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం భావిస్తోందని అంటున్నారు. అందుకే గతంలో ఎన్నడూ లేనట్లు చంద్రబాబు 4.0 పానలో అర్ధరాత్రి షాక్ ట్రీట్మెంట్లు ఇస్తున్నారని అంటున్నారు. గత నెలలో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన తుని అత్యాచారయత్నం కేసులో నిందితుడు అర్ధరాత్రి పూట శవంగా మారి చెరువులో తేలాడు. ఆ ఘటన తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం, పోలీసులు చెప్పిన అంశాలను అంతా ఆమోదించారు. విపక్షం కూడా ఈ విషయాన్ని తప్పుపట్టేలా మాట్లాడలేకపోయింది. ఈ ఘటన తర్వాత రాష్ట్రంలో ఆ తరహా నేరాలకు పాల్పడితే ఎలాంటి శిక్ష పడుతుందనే సంకేతాలను ప్రభుత్వం గట్టిగా పంపినట్టైందని అంటున్నారు. ఇక తాజాగా నెల్లూరులో గంజాయి డాన్ కామాక్షికి చెందిన ఐదు ఇళ్లను అర్ధారాత్రి కూల్చివేశారు. స్థానిక ప్రజలే ఆగ్రహంతో కూల్చేశారని అంటున్నా.. దీనికి సంబంధించి ఒక్క ఫొటో కూడా బయటకు రాకపోవడం, తెల్లారిన తర్వాతే ఈ విషయం బయట ప్రపంచానికి తెలియడం వెనుక ప్రభుత్వం పక్కా వ్యూహం ఉందని అంటున్నారు. గంజాయి అమ్మకాలతో సవాల్ విసరడమే కాకుండా, ఓ వ్యక్తి ప్రాణాన్ని తీసి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టిన లేడీ డాన్ కామాక్షికి తగిన గుణపాఠం చెప్పాలనే కాన్సెప్టే ఇందులో ప్రధానంగా కనిపిస్తోందని అంటున్నారు. అర్ధరాత్రి పూట ఐదు ఇళ్లను ఏకకాలంలో ఒక కాలనీ ప్రజలు కూల్చేశారంటే నమ్మశక్యంగా లేదని, ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉన్నా అదృశ్య హస్తం అండతోనే ఈ పని జరిగిందని అంటున్నారు. అయితే ఈ విషయంలో కూల్చివేతలనే అంతా ఆమోదిస్తుండటం వల్ల ఎలాంటి విమర్శలు వినిపించలేదని అంటున్నారు. ఏపీలో ఈ తరహా షాక్ ట్రీట్మెంట్లు పూర్తి కొత్తగా ఉన్నాయంటున్నారు. యూపీలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ టైపులో చంద్రబాబు ఇంతటి సీరియస్ గా నిర్ణయాలు తీసుకోవడంపై హాట్ డిబేట్ జరుగుతోంది. సాధారణంగా అరాచకశక్తుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కఠినంగానే ఉంటారని అంటున్నారు. మావోయిస్టులు, హైదరాబాద్ మతకలహాలు, రాయలసీమ ఫ్యాక్షన్ పై గతంలో ఆయన తీసుకున్న నిర్ణయాలను ఉదహరిస్తున్నాయి. అయితే అప్పుడు పూర్తిగా చట్టబద్ధమైన రీతిలో శిక్షలు వేసేలా చర్యలు తీసుకునేవారని, కానీ ఇప్పుడు మారిన లోకానికి తగ్గట్టు స్పీడుగా శిక్షలు పడేలా చంద్రబాబు చర్యలు తీసుకోవడంపైనే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. యోగి టైపులో చంద్రబాబు నడుస్తున్న తీరు వల్ల ఏపీలో చిన్నచిన్న తప్పులకు ఇకపై పెద్ద శిక్షలు ఉంటాయనే సంకేతాలు పంపుతున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు..

### ఈ కొమ్మ లెక్కే వేరు.. సూపరు!



పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని మహాత్మాగాంధీ అన్న సంగతి తెలిసిందే. నిజంగా... పల్లెలు అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. ఇందులో భాగంగా... అక్షరాస్యత, పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధిని సాదిస్తాయి. ఈ సమయంలో తాజాగా ఓ గ్రామం ఈ విషయంలో ఫుల్ మార్కులు సంపాధించింది.. ఆదర్శంగా నిలిచింది. అవును... పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని గాంధీ చెప్పగా.. ఇప్పుడు చెప్పుకోబోయే పల్లె లెక్కే వేరు.. దీని కథ సూపరు. ఈ గ్రామంలో 250 కుటుంబాలు ఉంటే, ప్రతీ ఇంట్లోనూ ఒక ఉద్యోగి ఉన్నారు! ఆ గ్రామం పేరే.. ఏపీలోని పల్నాడు జిల్లాలోని రెడ్డిపాలెం. ఈ గ్రామంలో ఉన్నవారంతా ఎస్సీ, ఎస్టీలే. ఇది నల్లమల అంచున ఉన్న చిన్న పల్లె. ఇక్క 1912లోనే చర్చితో పాటు పాఠశాలను నెలకొల్పారు. గ్రామంలో ఐకమత్యానికి, విద్యాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడింది! ఫలితంగా... ప్రభుత్వంలోని పలు శాఖల్లో 65 మంది ఉద్యోగులు ఈ గ్రామం నుంచే ఉన్నారు. వీరిలో సివిల్ జడ్జి కోర్టు న్యాయధికారి, తహసీల్దార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు, పోలీసులు, పోస్టల్ ఉద్యోగులు, వాణిజ్య పన్నుల శాఖలో అనేకమంది ఉన్నారు. ఓ 40 మంది ఊరికి సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఈ ఊరిలోని ప్రజలంతా ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నా... ప్రతీ ఏటా డిసెంబర్ 3న నిర్వహించే పునీత ఫ్రాన్సిస్ శౌరి చర్చి పండగకు మాత్రం తప్పనిసరిగా గ్రామానికి చేరుకుంటారు. వేర్వేరు ప్రాంతల్లో సబ్ రిజిస్ట్రార్లుగా పని చేస్తున్న ముగ్గురి సారథ్యంలో ఈ గ్రామంలో ఉద్యోగుల సంఘం ఏర్పాటైంది. ఈ క్రమంలో గ్రామంలో మొక్కలు నాటారు. ఇదే క్రమంలో... పల్లెలోని ప్రతీ ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉంది. మరుగుదొడ్లు ఉన్నాయి. అదేవిధంగా... ఊరంతా సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఏటా అంతా ఊరికి చేరుకున్నప్పుడు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తుంటారు! మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ గ్రామంలో 1981 నుంచి ఇప్పటివరకూ 8 సార్లు సర్పంచ్ ఎన్నికలు జరగ్గా, ఏడుసార్లు ఏకగ్రీవం అయ్యాయి. ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు నుంచి 86 కి.మీ.. మాచర్ల నుంచి 42 కి.మీ.. మండల కేంద్రం ఉంచి 17 కి.మీ.. హైదరాబాద్ నుంచి 206 కి.మీ దూరంలో ఉన్న ఈ రెడ్డిపాలెం గ్రామానికి సమీప నగరాలుగా వినుకొండ, మాచర్ల, నరసరావుపేట, సత్తెనపల్లి ఉన్నాయి.

# డిప్యూటీ ఎంపీడీవోగా భాధ్యతలు స్వీకరించిన కృష్ణంరాజు

### గ్రేడ్ -1 సెక్రటరీ నుండి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో (జి.యస్.డబ్ల్యూ.ఎస్)గా వి.వి.కృష్ణంరాజు మంగళవారం భాధ్యతలను స్వీకరించినట్లు రాయవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కీర్తి స్పందన ప్రకటన ద్వారా తెలిపారు. కాగా మండపేట మండలం, వెలగతోడు గ్రామంలో గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శి గా పనిచేస్తున్న ఆయన డిప్యూటీ ఎం.పి.డి.ఓ గా పదోన్నతి పొంది, మండల జి.యస్.డబ్ల్యూ.ఎస్ అధికారిగా రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులలో చేరిన కృష్ణంరాజు కు ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో కీర్తి స్పందన, పరిపాలనా అధికారి వై ఎన్.ఎన్.గోపాల్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు అభినందనలు తెలిపారు.

# జాదూయి పితారా కిట్‌లను సద్వినియోగించుకోవాలి

### ఏఎంఓ పి రాంబాబు - ఈ నెల 5న మెగా పేటీఎం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు మోడల్ ప్రైమరీ పాఠశాలలకు జాదూయి పితారా కిట్లను సరఫరా చేసినట్లు సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. మండపేట పట్టణంలోని పటేల్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 150 ప్రాథమిక పాఠశాలలకు జాదూయి పితారా కిట్లను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కిట్లను పాఠశాలల ఉపాధ్యాయులు సమర్ధవంతంగా వినియోగించాలన్నారు. విద్యార్థులను పాఠశాలల వైపు ఆకట్టుకునే విధంగా ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా వారిలో లెర్నింగ్ అవుట్‌కమ్స్‌ను సాధించవచ్చునన్నారు. ఈ నెల 5న నిర్వహిస్తున్న మెగా పేటీఎం 3.0ను ప్రధానోపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు తెలిసే విధంగా అన్ని అంశాలను డిస్‌ప్లే చేయాల్సి ఉందన్నారు. అంతకుముందుగా ఆయన పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని, అందుకనుగుణంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపయోగిస్తూ బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

### నా తమ్ముడు వల్ల నాకు ప్రాణహాని ఉందని

# పోలీసులకి ఫిర్యాదు చేసిన సోదరి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బుడంపేటకు చెందిన సుజాతకు (బుల్లితల్లి) తన తమ్ముడు పొలమూరి రాంబాబు నుండి ప్రాణహాని ఉందని ఆరోపిస్తూ హైదరాబాద్ సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉపాధి రీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్న సుజాత వద్దకు, ఈసీఐఎల్ , దమ్మాయిగూడలో నివసిస్తున్న రాంబాబు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని, డబ్బులు ఇవ్వకపోతే హతమారుస్తానంటూ మైత్రివనం సెంటర్, ఎర్రగడ్డ మార్కెట్ వద్ద బెదిరించాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలానికి చెందిన సుజాతను జల్సా లకు ఈజీ మనీ కి అలవాటు పడ్డ తన తమ్ముడు పొలమూరి రాంబాబు అక్కడ ఏం చేస్తాడు అని బుడంపేటలో సుజాత బంధువులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సెలయేరు పత్రిక ఆరవ వార్షికోత్సవంలో

# పాల్గొన్న డిఈఓ డాక్టర్ సలీం భాష

### పరభాశులు ఎన్ని నేర్చిన మన మాతృభాషను మరవొద్దు భామాశ్రీ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోలసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో సెలయేరు పత్రిక ఆరవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.తెలుగు భాషపై ప్రేమతో, ఆంగ్ల భాష ఉపాధ్యాయుడైన మామిడిశెట్టి బాలాజీ "సెలయేరు మ్యాగజైన్"ను స్థాపించి, బాలలలో పుస్తక పఠన అలవాటు పెంచి, యువ రచయితలు, కవులుగా తయారయ్యేలా కృషి చేస్తున్నారు. పుస్తకాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, సృజనాత్మకతను వెలికితీయడమే తమ లక్ష్యమని బాలాజీ తెలిపారు. సెలయేరు ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైన కోనసీమ జిల్లా డీఈవో షేక్ సలీం భాష మాట్లాడుతూ నేటి రోజుల్లో సెల్‌ఫోన్‌కు అలవాటు పడి పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోతున్న తరుణంలో, తెలుగులో బాలల సాహిత్యాన్ని ప్రోత్సహించే విధంగా చేస్తున్న బాలాజీ కృషిని డీఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో నేదునూరు జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.పత్రికకు తమ రచనలు అందించిన విద్యార్థులకు డీఈఓ షేక్ సలీం భాష చేతుల మీదుగా బహుమతులు కూడా అందజేశారు.

### ఉమ్మీద్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు

# డిసెంబర్ 5 చివరి గడువు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కార్యాలయం, సహా. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్ లు యుద్ధ ప్రాతపదికన పనిచేస్తున్నారు ఆలస్యం చేయకుండా వివరాలు అన్నీ వక్ఫ్ సంస్థలు వివరాలు నమోదు చేసుకోండి. మహమ్మద్ మీరాన్ షరీఫ్ అధ్యక్షులు జిల్లా టిడిపి మైనార్టీ సెల్ డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉమీద్ పోర్టల్ గడువు ఈ నెల 5 వ తేదీ తో ముగియనుండడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న మస్జిద్‌లు, దర్గాలు, అశూర్‌ఖానాలు, కబర్‌స్తాన్లు సహా అన్ని వక్ఫ్ సంస్థల నిర్వాహకులు అత్యవసర చర్యలు చేపట్టాలని కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ మీరాన్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మీద్ పోర్టల్లో వక్ఫ్ సంస్థల అన్నీ వివరాలు తప్పనిసరిగా డిసెంబర్ 5 లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత అప్‌లోడ్ చేసేందుకు లీగల్, అడ్మినిస్ట్రేటివ్ సమస్యలు ఎదురవుతాయని షరీఫ్ పేర్కొన్నారు. ఏ సంస్థ కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అవసరమైన పత్రాలు సిద్ధం చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. వక్ఫ్ ఆస్తుల భద్రత, పారదర్శకత కోసం ప్రతి సంస్థ తమ బాధ్యతని నెరవేర్చాలని అన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయం, జిల్లా ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్ లు ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్నారని, గడువు ముగుస్తున్నందున యుద్ధ ప్రతిపాదికన అందరికీ అందుబాటులో ఉంటారని, రాష్ట్ర వ్యాప్తంగా నమోదు ప్రక్రియలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డ్ . కార్యాలయ సిబ్బంది. మసీద్ కమిటీ లకు అందుబాటులో ఉంటారని నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మీరాన్ షరీఫ్ ఒక ప్రకటనలో మసీద్ కమిటీలకు విజ్ఞప్తి చేశారు

# సరికొత్త ఆవిష్కరణలకు పట్టం కడదాం..

**గుర్తింపు, భద్రత, ప్రోత్సాహంపై దృష్టి - కొత్త ఆవిష్కరణలను గుర్తించిన వెంటనే పేటెంట్**
**స్టార్టప్ లకు ప్రోత్సాహం, పారిశ్రామిక అనుసంధానం ముఖ్యం - రక్షణకు భరోసా ఇస్తే సమాజం నుంచి కొత్తతరం ఆవిష్కర్తలు బయటికి వస్తారు**
**శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రోత్సాహం, నిధులు సమకూర్చడం కీలకాంశం**
**గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మేడిన్ ఇండియా.. మేకిన్ ఇండియాలో భాగస్వామ్యానికి కృషి**
**శాస్త్ర, సాంకేతిక శాఖ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ స్థాయిలో సరికొత్త ఆవిష్కరణలకు గుర్తింపు, భద్రత, ప్రోత్సాహం అనే అంశాలపై దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. నూతన ఆవిష్కరణలను గుర్తించి తక్షణం పేటెంట్ హక్కు కల్పించడంతోపాటు వారి ఎదుగుదలకు కావాల్సిన ప్రోత్సాహం అందించగలిగితే గ్రామ స్థాయి నుంచి కొత్త తరం ఆవిష్కర్తలను బయటకు తీసుకురావచ్చని తెలిపారు. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పం మేడిన్ ఇండియా.. మేకిన్ ఇండియాలో మనవంతు భాగస్వామ్యం అయ్యేందుకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. అందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గడచిన ఏడాది కాలంలో రాష్ట్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆరా తీశారు. రాజమండ్రిలోని స్వామి జ్ఞానంద ప్రాంతీయ సైన్స్ సెంటర్ కార్యకలాపాలపై సమీక్షించారు. నూతన ఆవిష్కర్తల అన్వేషణ, ప్రోత్సాహం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు నూతన ఆవిష్కరణలే ప్రాథమిక చోదక శక్తి. శాస్త్ర



సాంకేతిక రంగాల్లో కొత్త ఆలోచనలను గుర్తించడం, ప్రోత్సాహం అందించడం, వాటిని సాకారం చేసుకుని మార్కెట్కి చేరేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం కీలకం. స్టార్టప్ లతో ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలి. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి, గ్రామ స్థాయిలో నూతన ఆవిష్కరణలను గుర్తించాలి. విశ్వ విద్యాలయం స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు ఎంతో మంది సరికొత్త ఆవిష్కరణలతో తమ సామర్థ్యాన్ని చాటుకున్నారు. అలాంటి వారిని గుర్తించి బయటకు తీసుకురావాలి. సరికొత్త ఆలోచనలను గుర్తించి ప్రోత్సాహం అందించాలి. వారిని పారిశ్రామికవేత్తలతో, ఐటీ స్టార్టప్లు, ఎన్.ఆర్.ఐ.లు, విశ్వవిద్యాలయం స్థాయి పరిశోధకులతో అనుసంధానం చేయాలి. వారి ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు రక్షణ కల్పించడం ముఖ్యం. అందుకోసం గుర్తింపు పొందిన ఆవిష్కరణలపై అధ్యయనం ప్రక్రియ పూర్తయిన వెంటనే భద్రత కల్పిస్తూ పేటెంట్ రైట్స్ ఇప్పించాలి. ఇప్పటి వరకు ఈ తరహా ఆవిష్కరణలు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందినా ఓ వేదికపై బహుమతులు అందించడం వద్దే ఆగిపోతున్నాయి.

**మన అవసరాలు మనమే తీర్చుకునే ఆలోచనలకు ప్రోత్సాహం**

ఒక గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలు తీర్చేందుకు ఎలాంటి సాంకేతికత అవసరమో ఆ దిశగా ఆలోచనలు చేసే వారిని ప్రోత్సహిద్దాం. కనీస సౌకర్యాలు లేని కుటుంబంలో పుట్టిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అయ్యారు. ఆయన స్ఫూర్తితో సరికొత్త ఆవిష్కరణలు చేసే యువతకు రాష్ట్రంలో కొదవ లేదు. రాజమండ్రి ప్రాంతీయ సైన్స్ సెంటర్ కి వెళ్లిన సందర్భంలో అక్కడ విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని తగ్గించాలన్న ఆలోచనతో రూపొందించిన కొన్ని ఆవిష్కరణలు నన్ను ఆకర్షించాయి. అలాంటి వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో అద్భుతాలు సృష్టిస్తారు. అది భౌతిక శాస్త్రం కావచ్చు, రసాయన శాస్త్రం కావచ్చు, మరేదైనా కావచ్చు మన అవసరాలకు తగిన విధంగా ఆవిష్కరణలు ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. ఆవిష్కరణలకు విద్యార్హత కొలమానం కాదు. వయోబేధాలు, ప్రాంతీయ బేధాలతో సంబంధం లేదు. ఉదాహరణకు నల్లమల అటవీ ప్రాంతానికి చెందిన శివ అనే ఓ చెంచు యువకుడు తమ ప్రాంతంలో యురేనియం తవ్వకాల కోసం జరుగుతున్న అన్వేషణను నా దృష్టికి తీసుకు వచ్చాడు. తమ ఉనికికి పొంచి ఉన్న ప్రమాదాన్ని వివరించాడు. యురేనియం బారి నుంచి తమ గ్రామాన్ని ఎలా కాపాడాలో తెలిపి సహాయం కోరాడు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి మనం దాన్ని ఆపగలిగాం. తీర ప్రాంతాల్లో నివశించే మత్స్యకార యువతలో వలలు, వేట సామాగ్రి తయారీలో అద్భుతమైన నైపుణ్యం ఉంటుంది. ఆ నైపుణ్యానికి సాంకేతికత జోడిస్తే వేటను సులభతరం చేసే అద్భుత ఆవిష్కరణ బయటకు వస్తుంది. అందుకు మనమంతా చేయాల్సిన ముఖ్యమైన పని సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు గుర్తించడమే. అధ్యయనం తర్వాత ఆ ఆవిష్కరణలు విపణికి చేరేందుకు సహకారం అందించాలి. పారిశ్రామికవేత్తలు, ఎన్.ఆర్.ఐ.లు, ఆలోచనలకు మరింత పదును పెట్టేందుకు విశ్వవిద్యాలయం స్థాయి ప్రొఫెసర్లతో కలిపి ఒక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి. నూతన సంవత్సరం.. నూతన ఆవిష్కరణలతో మన రాష్ట్ర యువత మేధస్సుని వెలుగులోకి తీసుకురావాలి" అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, మెంబర్ సెక్రటరీ శరవణన్, ఆప్ కాస్ట్ సీఈఓ, మెంబర్ సెక్రటరీ డాక్టర్ కె. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు భూమి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన అవసరం

## భూసార పరీక్షలపై పాఠశాల విద్యార్థులకు శిక్షణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భూసార పరీక్షల తీరు తెన్నులు, నిర్వహణపై పాఠశాల విద్యార్థులకు రేఖామాత్రంగా నైనా అవగాహన ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాఠశాల విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణ ఇవ్వడం ద్వారా అనేది నేల ఆరోగ్యం, పోషకాల గురించి అవగాహన కల్పించడానికి, మట్టి నమూనాలను సేకరించి, విశ్లేషించడం నేర్పించడానికి, నేల ఆరోగ్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన పీఎం శ్రీ స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం 2025 (పీఎంశ్రీ-ఎస్.ఎస్.హెచ్.పి) కింద విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా ఈ శిక్షణా కార్యక్రమాలు జరుగు తున్నాయి. ఇందులో భాగంగానే కాకినాడ జిల్లాలోని ప్రతీ మండలం లోనూ శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు కూడా మంగళవారం ఈ శిక్షణను ఇచ్చారు. తుని ప్రాంతం వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ" (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ - "ఆత్మ") ఆధ్వర్యంలో సామర్లకోట వ్యవసాయశాఖ అధికారి కె.విజయ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆదర్శ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు సాయిల్ టెస్టింగ్ లేబరేటరీ ఏవోలు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. భూసార పరీక్ష ఆవశ్యకత, వాటి ప్రాధాన్యత, మట్టి నమూనాలను సేకరించే విధానం, మట్టి నమూనాలను తీసే పద్ధతిని చూపించి అందుకు ముందుగా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ, భూమికి సూక్ష్మ పోషకాల ఆవశ్యకత, పోషకాల లోపాలు, విశ్లేషణ పద్ధతులు, మట్టి నమూనా పరీక్షల వల్ల కలిగే లాభాలు, భూసార పరీక్ష పత్రం వంటి అంశాలపై విద్యార్థినీ, విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులే మట్టి నమూనాలను సేకరించి, విద్యార్థులే పరీక్ష చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన 50 కిట్లను అందజేశారు. అనంతరం మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని వివరించి, చూపించి ఆపై విద్యార్థినీ, విద్యార్థులతో ప్రయోగం చేయించారు. ఈ పరీక్షల అనుభవం ఫలితంగా రైతులకు ఎరువుల సిఫార్సులు చేయడంలో విద్యార్థులు సహాయ పడాలని సూచించారు. సాగు భూమి ఆరోగ్యంపై విద్యార్థులకు కూడా ప్రాథమిక అవగాహన అవసరమని, అందుకే ఈ శిక్షణను ఇస్తున్నామని శంఖవరం మండల వ్యవసాయ శాఖ అధికారి పడాల గాంధీ తరగతి గదిలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వీర్రాజు, ఉపాధ్యాయులు, ఆత్మ బి.టి.ఎం. ఎన్.బాబురావు, ఏ.ఈ.ఓ. శ్రీనివాస్, వ్యవసాయ సహాయకుడు క్రాంతి పాల్గొన్నారు.

### చేబ్రోలు పి.హెచ్.సి. వద్ద

# రోగి మృతికి కారణమైన వైద్యుడి సస్పెన్సన్ ...!





గొల్లప్రోలు, విశ్వం వాయిస్ న్యూస్ : పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతికి పరోక్ష కారణమైన ఆస్పత్రి వైద్యులు సాయిరతన్ ని కాకినాడ జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె.నరసింహ నాయక్ మంగళవారం సస్పెండ్ చేసారు. ఆయన స్థానంలో ఆస్పత్రి వైద్య విధుల నిర్వహణకు కోలో కేటేడ్ తాళ్ళరేవు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఎల్.సురేష్ కుమార్ ని డిప్యూటేషనుపై నియమించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు సంబంధిత ఉత్తర్వులను జారీ చేస్తూ అంతా 24 గంటల్లోనే క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె.నరసింహ నాయక్ విడుదల చేసిన మీడియా ప్రకటన వివరాలు ఇలా ఉన్నాయి. 2 తేది మంగళవారం రాత్రి సుమారు 2.45 గంటల సమయంలో స్థానిక హోటల్లో పనిచేస్తున్న ఇమ్మంది మాణిక్యం అనే వ్యక్తికి గుండె నొప్పిగా ఉందని చెప్పడంతో గొల్లప్రోలు మండలం చేబ్రోలు పి.హెచ్.సి కి తీసుకుని వెళ్ళగా తాళాలు వేసి ఉండడంతో 108 కి ఫోన్ చేశారని, ఆ 108 సిబ్బంది గంట తర్వాత వచ్చి, పరీక్షించి అప్పటికే మాణిక్యం మృతి చెందినట్లు నిర్ధారించారు. చేబ్రోలు పి.హెచ్. సి లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. వీరు ఇరువురిలో ఒక మెడికల్ ఆఫీసరైన డా. వి.నిఖిల్ సెలవులో ఉండగా, రెండవ మెడికల్ ఆఫీసరైన డా. సాయి రతన్ డ్యూటీ రోస్టర్ వెయ్యడం, అత్యవసర విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా గుండె పోటుతో వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన బాధితుడు మాణిక్యంకి సకాలంలో వైద్య చికిత్స అందక మరణించాడు. ఈ దుర్ఘటనకు బాధ్యులను చేస్తూ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు సాయిరతన్ ను సస్పెండ్ చేసాం. అలాగే స్టాఫ్ నర్సుకి షోకాజు నోటీసు ఇచ్చాం. డిప్యూటేషన్ పై ఉన్న స్టాఫ్ నర్సుని తక్షణం చేబ్రోలు పి.హెచ్.సిలో రిపోర్ట్ చెయ్యవలసినదిగా ఆదేశించామని కాకినాడ జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె.నరసింహ నాయక్ ప్రకటించారు.

### శంఖవరం డిప్యూటీ ఎంపీడీవోగా

# చిన వెంకాయమ్మ నియామకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల ప్రజా పరిషత్తు ఉప అభివృద్ధి అధికారిణి (డిప్యూటీ ఎంపీడీవో)గా ఎస్.చినవెంకాయమ్మ సోమవారం విధుల్లో చేరారు. శంఖవరం మండల పూర్వ ఇంఛార్జి ఈవోపీఆర్డి, అన్నవరం సీనియర్ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి, శంఖవరం సీనియర్ కార్యదర్శి కూసిరెడ్డి అప్పలరాజు సంయుక్త ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో వెంకాయమ్మకు మంగళవారం మండలంలోని మిగతా సచివాలయాల సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆమెను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛాలను బహుకరించి, శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. సిబ్బంది అందరూ పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఈమె విశ్వం వాయిస్ తో తన గురించి తాను క్లుప్తంగా చెప్పారు. 15 ఏళ్ళ క్రితం పంచాయతీ రాజ్ శాఖ విధుల్లో తొలి సారి బాధ్యతలను స్వీకరించిన తాను తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం వాకలకొండ సచివాలయం గ్రేడ్ 1 కార్యదర్శిగా విధులను నిర్వర్తిస్తూ డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగాన్ని తిని పొంది ఆపై ఈ శంఖవరం మండలానికి బదిలీపై వచ్చి విధుల్లో చేరాను అన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల శాఖల అభివృద్ధికి బాధ్యత వహించే తాను సచివాలయాల కార్యదర్శులు, మిగతా సిబ్బందినీ సమన్వయం చేస్తూ మండలం సంపూర్ణ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. దీనికి తోటి ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలూ పూర్తిగా సహకరించాలని కోరుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్తు కార్యాలయం పరిపాలనా అధికారిణి పుష్పమీకీర్తి, గొంధి కొత్తపల్లి సచివాలయం కార్యదర్శి మేడిబోయిన వీరబాబు, మరి కొందరు సిబ్బంది పాల్గొన్నారు.

# డివిజన్ స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలకు 28 మంది...



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం ఉపాధ్యాయులకు కత్తిపూడిలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయుల ఒక్క రోజు క్రీడా పోటీలు ఉదయం ఎంతో ఉత్సాకరంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 గంటలకు ఘనంగా ప్రారంభమైన ఈ క్రీడా పోటీలు సాయంత్రం 5 గంటలకు విజయవంతంగా ముగిసాయి. ఉపాధ్యాయుల్లో దేహ ధారుఢ్యం, ఆరోగ్యం, ఒత్తిడిని, మానసిక ప్రశాంతత నిర్వహణను ప్రోత్సాహించడం, జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ గుణాలను, మానసిక ఉల్లాసానికి వినోదాత్మకతను పెంపొందించడం, వేదిక క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించడం, అన్ని వర్గాల ఉపాధ్యాయుల మధ్య ఐక్యత, సౌహార్దాన్ని బలోపేతం చేయడం, క్రీడల్లో చురుకుగా పాల్గొనే దృష్టాంతాన్ని స్థాపించడం ద్వారా విద్యార్థులను ప్రేరేపించడం ఈ ఆటల పోటీల నిర్వహణ ముఖ్య లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహించారు. ఉదయం పూట ఉపాధ్యాయినిలకు త్రో బాల్ ఆటల పోటీలను నిర్వహించారు. దీనిలో సుమరు 53 మంది క్రీడాకారిణులు పాల్గొనగా వీరి నుంచి 12 మంది డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యారు. అలాగే మధ్యాహ్నం పూట పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ ఆటల పోటీలను నిర్వహించగా దీనిలో 87 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో నుంచి 16 మంది డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో పాన్న ఉపాధ్యాయ క్రీడాకారులను, ఈ పోటీలను విజయ వంతంగా నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమ అభినందించారు.

# విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

## వైసిపి నేత కుంచే రమణారావు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగుతాయని విద్యకు పేదరికం అడ్డుకారాదని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరులో




పేద కుటుంబానికి చెందిన కొడమంచిలి వెంకటేశ్వరరావు కుమార్తె కృపావతి బిటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. నాలుగు సంవత్సరాల బిటెక్ కోర్సు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న రమణారావు కృపావతి చదువు కొనసాగించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృపావతి చదువు కొనసాగించేందుకు రమణారావు రూ. 25 వేలు చెక్కును కృపావతి కి అందజేసి భరోసా ఇచ్చారు.ఆర్థిక సాయం అందజేసే చదువును ప్రోత్సహిస్తున్న రమణారావుకు ఈ సందర్భంగా కృపావతి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పినిపే జయరాజ్, నేరేడుమిల్లి శ్రీను,నక్కా సంపత్ కుమార్,పందిరి సుబ్బరాజు,గంటా లక్ష్మీప్రసాద్,వినోద్, జోసెఫ్,అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో మెటల్ క్లస్టర్

**ఖనిజ ఉత్పత్తుల కంపెనీలను ప్రోత్సహించాలి - ఏపీ ఎండీసీని బలోపేతం చేయాలి**
**గనుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ఎండీసీని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో గనుల తవ్వకాలు... ఉచిత ఇసుక అమలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."లీజుకిచ్చిన గనులు కాకుండా... ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమ తవ్వకాలు జరిగితే.. వాటిని ఆర్టీజీఎస్ వ్యవస్థ ద్వారా గుర్తించేలా చూడాలి. దీని కోసం డ్రోన్, శాటిలైట్ చిత్రాలను వినియోగించుకోవాలి. అలాగే గనుల ద్వారా వచ్చే ఆదాయం విషయంలో ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అంచనా వేసుకోవాలి. గనుల ద్వారా ఆదాయాన్ని పొందుతున్న రాష్ట్రాల్లో ఒడిషా మొదటి స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారో గమనించి... వాటిని మన రాష్ట్రంలో అమలు చేసే అంశాన్ని పరిశీలించాలి. అలాగే గనుల నుంచి వచ్చే వివిధ ఖనిజాలకు సంబంధించిన ముడి సరుకును ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతోపాటు... ఆ ఖనిజాలకు వాల్యూ యాడెడ్ చేయడం ద్వారా దేశీయంగా వాటిని వినియోగించుకుని.. మరింత ఆదాయం వచ్చేలా చేయాలి. విశాఖలో పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. బాగా అభివృద్ధి జరగబోతోంది. ఉత్తరాంధ్ర కేంద్రంగా మెటల్ కు సంబంధించిన క్లస్టర్ ఏర్పాటు చేయండి. విశాఖలో ఏర్పాటు కాబోయే వివిధ కంపెనీల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సరఫరా జరిగేలా చూడాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. "రాష్ట్రంలో లైమ్ స్టోన్, బీచ్ శాండ్, ఐరన్ ఓర్, మాంగనీస్, క్వార్ట్జ్, సిలికా శాండ్, క్లేస్, గ్రానైట్ సహా వివిధ ఖనిజాలు ఉన్నాయి. ఈ ఖనిజాలు ఏయే ఉత్పత్తులకు ముడిసరుకుగా ఉపయోగపడుతాయో విశ్లేషించండి. ఆ మేరకు ఏయే ఖనిజాలను నేరుగా ముడిసరుకు రూపంలో ఎగుమతులు చేయవచ్చు... ఏయే ఖనిజాలకు వాల్యూ యాడ్ చేసి దేశంలోనూ.. రాష్ట్రంలోనూ వినియోగించుకోవచ్చోననే అంశంపై విశ్లేషించాలి. ఆ మేరకు గనుల శాఖ ఆలోచన చేయాలి. సిమెంట్ ఫ్యాక్టరీలు ఇప్పటికే లైమ్ స్టోన్ ఖనిజాన్ని తీసుకుంటున్నాయి. ఇదే విధంగా ఐరన్ ఓర్ స్థానికంగా ఉన్న స్టీల్ పరిశ్రమలు ఉపయోగించుకుంటున్నాయి.

# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

బుధవారం, 03 డిసెంబర్ 2025
www.viswamvoice.com






# సీఎం చంద్రబాబు నల్లజర్ల పర్యటన

**డిసెంబర్ 3న "రైతన్న మీ కోసం" కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు**
**అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ ట్రయిల్ రన్ - అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం**
**- కట్టుదిట్టమైన చర్యలు : కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 3న నల్లజర్లలో నిర్వహించనున్న "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నల్లజర్ల సభా ప్రాంగణంలో ఉదయం నుండి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవ కుమార్ తదితరులు క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేపట్టిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సూచనలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. 'రైతన్న మీ కోసం' సమావేశం అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ "రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి "రైతన్న మీ కోసం" కార్యక్రమం విజయవంతం కావడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందని వెల్లడించారు. పెద్ద ఎత్తున రైతులు పాల్గొనే నేపథ్యం లో అందుకు తగిన విధంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామన్నారు" అని తెలిపారు. సీఎం పర్యటన దృష్ట్యా ప్రోటోకాల్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, హెలిప్యాడ్, స్టాల్స్, రైతుల ముఖాముఖి కార్యక్రమం వంటి అన్ని అంశాలపై సమగ్ర ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రముఖులతో పరిచయ కార్యక్రమం, వివిధ ప్రభుత్వ శాఖలు మరియు కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, ప్రజా వేదిక ద్వారా రైతులతో ముఖాముఖి, తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఏలూరు రేంజ్ ఐజీ జివికె అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఇతర అనుబంధ శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ ట్రయిల్ రన్ నిర్వహించారు.



# హితకారిణి సమాజం

# అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**విద్యాసంస్థల అభివృద్ధికి తమ వంతు కృషి - కందుకూరి ఆశయ సాధనలో అభివృద్ధి కార్యక్రమాలు**
**హాస్టల్లో నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యుగపురుషుడు, మహానీయ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం త్యాగసేవలను స్మరిస్తూ ఆయన స్థాపించిన హితకారిణి సమాజం ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థల అభివృద్ధికి తమ వంతు కృషి కొనసాగుతుందని హితకారిణి సమాజం చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్ తెలిపారు. కందుకూరి వారసత్వం, ఆయన ప్రతిష్ఠను కాపాడుతూ విద్య, వసతి, అభివృద్ధి రంగాల్లో సమాజం మరింత మెరుగైన సేవలు అందించాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. స్థానిక దానవాయిపేటలో ఉన్న శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల ఆవరణలోని విద్యార్థినుల హాస్టల్ పరిశీలన సందర్భంగా అక్కడి మరుగుదొడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటం తాము తీవ్ర ఆవేదన చెందేలా చేసిందని చైర్మన్ యాళ్ల ప్రదీప్ పేర్కొన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితులు ఉండకూడదనే భావంతో హాస్టల్ శానిటేషన్ సదుపాయాల అభివృద్ధికి తక్షణ చర్యలు ప్రారంభించామని చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన, హితకారిణి సమాజం మాజీ చైర్మన్ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, హితకారిణి సమాజం మాజీ చైర్మన్ చల్లా శంకర్రావుతో కలిసి నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 7.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న 40 మరుగుదొడ్ల బ్లాక్‌కు కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హాస్టల్లో విద్యార్థినులకు మంచి పౌష్టికాహారం, శుభ్రమైన వసతి సదుపాయాలు కల్పించడం తో పాటు భవనం స్లాబ్ మరమ్మతులు, అంతర్గత అభివృద్ధి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని చైర్మన్ వివరించారు. విద్యార్థినుల సంక్షేమమే తమకు ప్రాధాన్యం అని, కందుకూరి ఆశయ సాధనలో భాగంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. హితకారిణి సమాజం అభివృద్ధికి కట్టుబడి పనిచేసే తాము వంటి డైరెక్టర్ల బృందాన్ని నియమించినందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్లు,హాస్టల్ వార్డెన్ ఎం.విశాలాక్షి,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సింహాచలనగర్‌లో పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు.ఆ దిశగానే మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తున్నా మన్నారు.స్థానిక 49వ డివిజన్ సింహాచల నగర్‌లో రూ 42లక్షలు 50వేలతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం ఆయన కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధ్వాన్నంగా ఉన్న పార్కును ఆరోగ్య రాజమండ్రిలో భాగంగా పేర్కొని తీర్చిదిద్దుతున్నామని వివరించారు. తాము ఎందుకు అభివృద్ధి చేయలేకపోయామా అని వైసిపి వాళ్ళు భావించే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. పార్కు నిర్వహణ రెండేళ్లపాటు చూసుకునేలా టెండర్లు పిలిచే బాధ్యత కూడా తీసుకుంటామని తెలిపారు. దీంతో పాటు 50డివిజన్ లో 4పార్కులు, 1వ డివిజన్ లో రెండు పార్కులు కూడా అభివృద్ధి ప్రస్తావిస్తూ, మొత్తం ఐదు దశల్లో నగరంలో 30 పార్కులు అభివృద్ధి చేస్తున్నామని ఆయన వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆలోచన లేకుండా వ్యవహరించారని, పేదలు నివసించే ప్రాంతాల అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. ఏవి అప్పారావు రోడ్డు, జెఎన్ రోడ్డు వంటి రోడ్లు, కంబాలచెర్వు పార్క్ అభివృద్ధి చేసి, ఇదే అభివృద్ధి అనడం కాదని ఆయన వ్యాఖ్యానించారు. కాంట్రాక్టర్‌తో చెప్పి లీకేజీలు సరిచేయించా మని, రూ 9లక్షలు వెచ్చించి, డ్రైనేజి కూడా నిర్మాణం చేయబోతున్నామని ఆయన తెలిపారు. మోటారు కూడా అవసరమనుకుంటే అది కూడా చేసిపెట్టామని ఆయన తెలిపారు. ఆరోగ్య రాజమండ్రిలో భాగంగా క్రమం తప్పకుండ ప్రతి రెండు నెలలకొకసారి డ్రైన్స్ అన్నీ డీసిల్టింగ్ చేయిస్తున్నామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. డ్రైన్ బ్లాక్ అయితే ప్రజలకు వచ్చే ఇబ్బంది ఏమిటో తెలుసు కనుక ఈవిధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. డ్రైన్ నిర్మాణం చేయడమే కాదు, దాని నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలోకి కాంగ్రెస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**అంకితభావంతో నాయకులుగా ఎదగాలి**
**కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ పర్యటనలో మాజీ ఎమ్మెల్యే అంబా ప్రసాద్**



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** నిడదవోలు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు భావన రమేష్ అధ్యక్షతన నియోజవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో నాయకులు కార్యకర్తలతో సమావేశం ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే అంబాప్రసాద్,తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టి.కే విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు.అనంతరం అంబా ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు అందరూ గ్రామస్థాయిలోకి వెళ్లాలని అలాగే కార్యకర్తల్లో కార్యకర్తల్లానే ఉండిపోతున్నారని వాళ్ళలో కాంగ్రెస్ పట్ల అంకితభావం ఉన్న వ్యక్తుల నుండి నాయకులుగా తీర్చిదిద్దడానికి వారికి అవకాశం ఇవ్వాలని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అబ్జర్వర్‌గా నన్ను ఇక్కడ పంపించారు. కావున మీ యొక్క వ్యక్తిగత అభిప్రాయాలు నాకు చెబితే వాటిని ఎఐసిసికి నేరుగా అందజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర మాట్లాడుతూ ఇకనుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం త్వరలోనే ఒక రూపకల్పన చేసి ప్రతి గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశంలో ప్రజలు ఎలా ఉండేవారు ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నారో అని ప్రజలకు వివరించడం కోసం ఒక మహత్తరమైన కార్యక్రమం రూపకల్పన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, సుజాత, కాకి కిషోర్, భాస్కర్ ప్రసాద్, కటిక శ్రీను,రమణ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లేలా

# అధ్యాపకులు కృషి చెయ్యాలి

**తరగతి గదులు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యాశాఖ నవశకాన్ని నిర్మించుకుంటూ నూతన విధానాలతో ముందుకు వెళుతుందని ప్రజలకు విద్యను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఉదయంరాజమహేంద్రవరం రూరల్ మండలం స్థానిక సాటిలైట్ సిటీ గ్రామంలో హై స్కూల్ నందు 72 లక్షల రూపాయలు మనబడి మన భవిష్యత్ ఫేస్-2 నిధులతో నూతనంగా నిర్మించిన 6 అదనపు తరగతులు ప్రారంభోత్సవం మరియు 46.20 లక్షల రూపాయలు ఏ.డబ్ల్యు.పి నిధులతో కెమిస్ట్రీ, బయాలజీ నూతన ల్యాబ్లు నిర్మించేందుకు శంకుస్థాపన కార్యక్రమాలను ఎమ్మెల్యే గోరంట్ల ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తితో కలిసి పాల్గొన్నారు.ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఆరు అదనపు తరగతి గదులు విద్యార్థులకు చాలా సౌకర్యవంతంగా నిర్మించడం జరిగిందని, వీటితోపాటు త్వరలోనే కెమిస్ట్రీ,బయాలజీ ల్యాబ్లు కూడా నిర్మించడం జరుగుతుందని అన్నారు. సాటిలైట్ సిటీ హైస్కూల్ నందు ఉన్న విద్యార్థులందరూ పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారిని ఇక్కడి నుండి విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నతమైన స్థానాలకు వెళ్లే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు. నూతనంగా నిర్మించిన తరగతి గదులకు కావలసిన ఫర్నిచర్ మరియు ఇతర పరికరాలు ఒక వారం రోజుల్లో అందించడం జరుగుతుందని తెలిపారు. హై స్కూల్ ప్రక్కనగల ఎలిమెంటరీ స్కూల్ నందు బోరు పాడైందని గోరంట్ల దృష్టికి సమస్యను తీసుకురాగా వెంటనే నూతన బోరు వేయించాలని మండల అభివృద్ధి అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్కూల్ కాంపౌండ్ నందు విద్యుత్ వైర్లు ఉన్నాయని స్వయంగా పరిశీలించిన గోరంట్ల సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన విద్యుత్ లైన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణ గౌడ్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, నిచ్చెనకోళ్ల సత్తిబాబు, దారా అన్నవరం, ఎమ్మెస్సార్ శ్రీను, బైరెత్తి సరోజినీ దేవి, భీరా ప్రకాష్, షేక్ అమీనా బేగం, ఏపీసి సమగ్ర శిక్ష సుభాషిని, స్కూల్ హెచ్‌ఎం నున్న ప్రశాంతి, పెంకె కోటేశ్వరరావు, ఎర్ర రాంబాబు, చౌడాడ లాజర్, గెద్దాడ కృష్ణ, జి.నాగేంద్ర, చౌడాడ సునీల్, వెలుగుబండి దుర్గారావు, ప్రసాద్ బాబు, మన్యం శ్రీను,మజ్జి సాయి కిరణ్, ఎంపీడీవో సునీల్ ఆర్మీ స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ సేవా మండలి ఆధ్వర్యంలో

# న్యూట్రీషియన్ ఫుడ్ పంపిణీ

**- ఆరోగ్యకరమైన సమాజం కోసం మందులు వాడి ఆరోగ్యంగా జీవించాలి**
**- హెచ్‌ఐవీ వ్యాధిపై అవగాహన సదస్సు**
**- జిల్లా లెపర్సీ అండ్ ఎయిడ్స్ కంట్రోలర్ డాక్టర్ వసుంధర**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్ ఐవీ ఎయిడ్స్ రోగులు నిరాశ నిస్పృహలకు గురికాకుండా నిరంతరం మందులు వాడి ఆరోగ్యంగా జీవించాలని జిల్లా లెపర్సీ ఎయిడ్స్ కంట్రోలర్ డాక్టర్ వసుంధర పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా మంగళవారం రాజమండ్రి వై జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో కోనసీమ సేవ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్. కృపారావు ఆధ్వర్యంలో హెచ్‌ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అవగాహన సదస్సు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎన్. వసుంధర, లెప్ర స్టేట్ కోఆర్డినేటర్ రాధిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ హెచ్‌ఐవి రోగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులను ప్రతిరోజు వాడి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. హెచ్‌ఐవి ఎయిడ్స్ వ్యాధికి నిరంతరం ఏ.ఆర్. టి మందులు వాడుతూ బలవర్ధకమైన ఆహారం తీసుకొని జీవించవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో జీవించాలని, ఆరోగ్యకరమైన సమాజం కోసం కృషి చేయాలని అన్నారు. లెప్ర స్వచ్ఛంద సేవా సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ హెచ్‌ఐవి ఎయిడ్స్ రోగులకు తమ సంస్థ ద్వారా ఏఆర్టి మందులు వాడే విధంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తల్లి నుంచి బిడ్డలకు హెచ్‌ఐవి సోకకుండా బిడ్డ కు 18 నెలలు వచ్చేవరకు ప్రభుత్వం అందించే ఏఆర్టి మందులు వాడించి బిడ్డ ఆరోగ్యంవంతంగా జీవించేందుకు కృషి చేస్తామని అన్నారు. దాతల సహకారంతో హెచ్ ఐ వి రోగులకు మందులు, న్యూట్రిషన్ ఫుడ్ ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కోనసీమ సేవా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.కృపారావు మాట్లాడుతూ డాక్టర్ వసుంధర, డాక్టర్ కిరణ్‌ల సహకారంతో హెచ్‌ఐవి రోగులను గుర్తించి ఏఆర్టి చికిత్స ద్వారా మందులు అందిస్తామని అన్నారు. అలాగే తమ సంస్థ ద్వారా పేదవారికి, చిన్నపిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తామని అన్నారు. తమ కోనసీమ సేవా మండలి సంస్థలో సుమారు 20 మంది సిబ్బందితో 20 మండలాలలో, 10 వేల మందికి పైగా హెచ్‌ఐవి ఎయిడ్స్ రోగులు రిజిస్టర్ అయి ఉన్నారని తెలిపారు. వారికి హెచ్‌ఐవి పై అవగాహన కలిగిస్తూ ఏ ఆర్ టి మందులు వాడే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. దాతలు స్వచ్ఛంద సేవా సంస్థలు ద్వారా రోగులకు మందులతో పాటు, బలవర్ధకమైన( న్యూట్రిషన్ ఫుడ్) ఆహార పదార్థాలు అందిస్తామని అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా 300 మంది ఎయిడ్స్ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మురళి,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డివి సత్యనారాయణ, డాక్టర్ వేణుగోపాలరావు, సలోమి, బేబీ, కీర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




# పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేత




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖర రావు వర్ధంతిని పురస్కరించుకుని నగరంలో పలుచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ మేరకు స్థానిక లాలచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ఉదయం అల్పాహారం మధ్యాహ్న భోజనంతో పాటు పుష్కర్ ఘాటు వద్ద ప్రత్యేక అన్నదానం జరిపించారు. స్వర్ణాంధ్ర ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన ఐదుగురు ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లను తిరుమల రావు సోదరుడు నున్న కృష్ణ చేతుల మీదుగా బహుకరించారు.ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర భవన నిర్మాణానికి 2010 తిరుమలరావు సోదరులు నున్న సురేష్ పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారని, సమస్తకు ప్రతిఏటా అన్నదానం కోసం తిరుమల విద్యాసంస్థలు తరపున సహకరిస్తున్నందులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల సర్వారాయుడు, హరికృష్ణ, మీరా కుమారి, దివ్య, సింధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రోగికి చాంబర్ ట్రస్ట్ ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమ ఘాట్ రాజమండ్రి వర్తకుల సేవా సంస్థ తమ ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈరోజు రవి శ్రీకాంత్ అనే క్యాన్సర్ రోగికి వైద్యం నిమిత్తం 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. సాయి కృష్ణా నగర్ ఆరవ వీధిలో నివాసం ఉంటున్న శ్రీకాంత్ చాంబర్ ట్రస్ట్ ఆర్థిక సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు మద్దుల మురళీకృష్ణ చేతుల మీదుగా ఈ సహాయాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వైద్యానికి కూడా సహాయం అందిస్తున్నట్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా తెలిపారు.

## క్రీడా వాయిస్

# తండ్రికి తగ్గ తనయుడు..

## సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అర్జున్ టెండూల్కర్ ఆల్ రౌండర్ షో



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఆల్-రౌండర్‌గా తన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. దేశీయ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గోవా జట్టు తరఫున ఆడుతున్న అర్జున్, మధ్యప్రదేశ్‌పై జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బౌలర్ పవర్‌ప్లేలో అద్భుతమైన స్పెల్‌తో కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు. గోవా జట్టు ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అర్జున్ బౌలింగ్, బ్యాటింగ్‌తో ఈ సీజన్‌లో గోవా తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. మధ్యప్రదేశ్ మొదట బ్యాటింగ్ చేసి 170 పరుగులు చేసింది. కానీ అర్జున్ టెండూల్కర్ పవర్‌ప్లేలో వేసిన కీలకమైన స్పెల్ కారణంగా వారు మరింత పెద్ద స్కోరు చేయలేకపోయారు. గోవా తరఫున తొలి ఓవర్‌ను వేసిన అర్జున్, ఐదో బంతికే శివాంగ్ కుమార్ను డకౌట్ చేసి ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే మరో కీలక వికెట్ అంకుష్ సింగ్ను కూడా అవుట్ చేశాడు. చివరి ఓవర్లలో కొంచెం ఎక్కువ పరుగులు ఇచ్చినా, అతను వెంకటేష్ అయ్యర్‌ను కేవలం 6 పరుగులకే అవుట్ చేసి తన మూడో వికెట్‌ను సాధించాడు. ఈ మ్యాచ్‌లో గోవా తరఫున బెస్ట్ బౌలింగ్ పర్ఫామెన్స్ (3 వికెట్లు) చేసింది అర్జున్ టెండూల్కరే. మధ్యప్రదేశ్ తరఫున హర్‌ప్రీత్ సింగ్ అజేయంగా 80 పరుగులు చేయగా, కెప్టెన్ రజత్ పాటిదార్ 29 పరుగులు, ఆఖర్లో అంకిత్ వర్మ 4 సిక్సర్ల సహాయంతో 34 పరుగులు చేశారు. మధ్యప్రదేశ్ విధించిన 170 పరుగుల లక్ష్యాన్ని గోవా 18.3 ఓవర్లలో సులభంగా ఛేదించింది. బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన తర్వాత, అర్జున్ టెండూల్కర్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా కూడా బరిలోకి దిగాడు. బ్యాటింగ్‌కు రాగానే మూడు ఫోర్లు కొట్టి దూకుడు చూపినా, 16 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తిరుపరేష్ సింగ్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఆ తర్వాత అభినవ్ తల్వారేజా, కెప్టెన్ సుయష్ ప్రభుదేసాయి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ కలిసి 66 బంతుల్లో 89 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కెప్టెన్ సుయష్ ప్రభుదేసాయి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి అజేయంగా 75 పరుగులు చేశాడు. చివర్లో లలిత్ యాదవ్ తో కలిసి కేవలం 27 బంతుల్లో 57 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ విజయంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గోవా తమ రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. అర్జున్ టెండూల్కర్ ఆల్-రౌండర్ ప్రదర్శన, ముఖ్యంగా పవర్‌ప్లేలో అతడు చూపిన బౌలింగ్ పర్ఫామెన్స్, గోవా విజయంలో కీలక పాత్ర పోషించింది.

# రెండు నెలలు క్రికెట్‌కు దూరమైనా ఫైర్ తగ్గలే..

## 42 బంతుల్లో 77 పరుగులు..టీ20 సిరీస్‌కు లైన్ క్లియర్



గాయం కారణంగా దాదాపు రెండు నెలలు క్రికెట్‌కు దూరంగా ఉన్న స్టార్ ఆల్-రౌండర్ హార్దిక్ పాండ్యా, ఎట్టకేలకు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టి సంచలనం సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025 లో బరోడా జట్టు తరఫున ఆడిన హార్దిక్, పంజాబ్‌పై 77 పరుగుల తుఫాన్ ఇన్నింగ్స్ ఆడి, తన జట్టుకు 7 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో తాను గాయం నుంచి పూర్తిగా కోలుకున్నట్లు నిరూపించాడు. ఆసియా కప్ 2025 లో గాయపడిన తర్వాత హార్దిక్ పాండ్యా క్రికెట్‌కు కొంతకాలం దూరంగా ఉన్నాడు. శ్రీలంకతో జరిగిన ఆసియా కప్ 2025 సూపర్-4 మ్యాచ్ సందర్భంగా హార్దిక్ పాండ్యా క్వాడ్రిసెప్ ఇంజరీకి (తొడ ముందు భాగంలో) గురయ్యాడు. ఈ గాయం కారణంగా అతను రెండు నెలల పాటు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమైన హార్దిక్, తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడానికి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. తొలి మ్యాచ్‌లోనే బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ పాల్గొనడం ద్వారా, తాను గాయం నుంచి పూర్తిగా కోలుకున్నట్లు హార్దిక్ నిరూపించాడు. ఈ ప్రదర్శనతో అతను సౌతాఫ్రికా సిరీస్‌లో జరగబోయే టీ20 సిరీస్‌లోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. పంజాబ్ జట్టు అద్భుతమైన బ్యాటింగ్‌తో బరోడా ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు ఏకంగా 222 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కెప్టెన్ అభిషేక్ శర్మ కేవలం 19 బంతుల్లో 50 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ 69 పరుగులు, నమన్ ధీర్ 39 పరుగులు చేశారు. బరోడా తరఫున బౌలింగ్ చేసిన హార్దిక్ పాండ్యా 4 ఓవర్లలో 52 పరుగులు ఇచ్చి ఒక వికెట్ (అభిషేక్ శర్మ) తీసుకున్నాడు. పరుగులు సమర్పించినా, పూర్తి కోటా ఓవర్లు వేయడం అతని ఫిట్‌నెస్‌కు సాక్ష్యం. 223 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బరోడా జట్టుకు హార్దిక్ పాండ్యా తన బ్యాటింగ్‌తో ఊపు తెచ్చాడు. 92 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయిన తర్వాత, నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్ పాండ్యా దూకుడు ప్రదర్శించాడు. అతను కేవలం 42 బంతుల్లో అజేయంగా 77 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్ స్ట్రైక్ రేట్ 183.33 గా ఉంది. అతని బ్యాట్ నుంచి 7 మెరుపు ఫోర్లు మరియు 4 భారీ సిక్సర్లు వచ్చాయి. హార్దిక్ ఈ విధ్వంసక ఇన్నింగ్స్ కారణంగా బరోడా జట్టు 223 పరుగుల భారీ లక్ష్యాన్ని సులభంగా ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

# గెలుపు వెనుక దాగున్న లోపాలు..

## రెండో వన్డేలో టీమిండియాకు ఈ 3 ప్రాబ్లమ్స్ చాలా డేంజర్

భారత క్రికెట్ జట్టు నవంబర్ 30న సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పుడు మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవడానికి డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో జరగబోయే రెండో వన్డేకు టీమిండియా సిద్ధమవుతోంది. తొలి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (135 పరుగులు), కుల్దీప్ యాదవ్ (4 వికెట్లు) అద్భుతంగా రాణించారు. అయితే విజయం సాధించినప్పటికీ, జట్టు కూర్పులో కొన్ని లోపాలు స్పష్టంగా కనిపించాయి. రెండో వన్డేలో భారత జట్టు తప్పనిసరిగా మెరుగుపరుచుకోవాల్సిన ఆ 3 బలహీనతలు ఏంటో చూద్దాం.

**రోహిత్-కోహ్లీ-రాహుల్‌పై అతిగా ఆధారపడటం**

తొలి వన్డేలో భారత జట్టు 349 పరుగుల భారీ స్కోరు సాధించినప్పటికీ, ఎక్కువ పరుగులు కేవలం ముగ్గురు సీనియర్ ఆటగాళ్ల నుంచే వచ్చాయి. విరాట్ కోహ్లీ (135), కేఎల్ రాహుల్ (60), రోహిత్ శర్మ (57) కలిసి మొత్తం 252 పరుగులు చేశారు. జట్టులో 10 మంది బ్యాటింగ్ చేసినప్పటికీ, మిగిలిన బ్యాట్స్‌మెన్లు అందరూ కలిసి కేవలం 74 పరుగులు మాత్రమే చేయగలిగారు. మిడిల్ ఆర్డర్, లోయర్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ల నుంచి పరుగులు రాలేదు. ప్రతిసారీ ముగ్గురు సీనియర్ల మీదే ఆధారపడటం మంచిది కాదు. రెండో వన్డేలో మిగిలిన భారతీయ బ్యాట్స్‌మెన్లు కూడా మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది.

**బ్యాటింగ్ ఆర్డర్‌లో తప్పుడు నిర్ణయాలు**

టెస్ట్ క్రికెట్‌లో బ్యాటింగ్ ఆర్డర్‌ను తరచుగా మార్చడంపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న భారత జట్టు, వన్డే మ్యాచ్‌లోనూ అదే తప్పును పునరావృతం చేసింది. ఈ మ్యాచ్‌లో ఆల్-రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో కేఎల్ రాహుల్ కంటే ముందు పంపించారు. ఈ వ్యూహం పూర్తిగా విఫలమైంది. సుందర్ కేవలం 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. సుందర్ బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు ఇంకా 23 ఓవర్లకు పైగా ఆట మిగిలి ఉంది. ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ఉద్దేశంతో పంపినా, సుందర్ భారీ షాట్ ఆడబోయి వికెట్ కోల్పోవడం జట్టు వ్యూహాన్ని దెబ్బతీసింది. రాహుల్ లాంటి నిలకడైన ఆటగాడిని పక్కన పెట్టి సుందర్‌ను ముందు పంపడం సరైన నిర్ణయం కాదు.

**డెత్ ఓవర్లలో బౌలింగ్ మెరుగుదల అవసరం**

తొలి వన్డేలో భారత బౌలింగ్ దాడి అనుభవం లేమితో కనిపించింది.. ముఖ్యంగా ఇన్నింగ్స్ చివరి దశలో. సౌతాఫ్రికా ఆటగాడు కార్బిన్ బాష్ భారత బౌలర్లను ఒంటరిగా ఎదుర్కొని పరుగులు రాబట్టగలిగాడు. యువ పేసర్ హర్షిత్ రాణా తన డెత్ ఓవర్ బౌలింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. సౌతాఫ్రికాకు చివరి 7 ఓవర్లలో 61 పరుగులు అవసరమైనప్పుడు, ఒక వైపు అర్ష్‌దీప్ సింగ్ కట్టుదిట్టంగా బౌలింగ్ వేసినా, రాణా తన చివరి 2 ఓవర్లలోనే 22 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ విభాగంలో రెండో వన్డేలో భారత్ మరింత మెరుగ్గా రాణించాలి. రెండో వన్డేలో ఈ మూడు బలహీనతలను సరిదిద్దుకుంటేనే, టీమిండియా సౌతాఫ్రికా పై 2-0 ఆధిక్యంతో సిరీస్‌ను సులభంగా గెలవగలుగుతుంది. లేదంటే, జట్టుపై ఒత్తిడి పెరిగి సిరీస్ పోరాటంగా మారే అవకాశం ఉంది.

# జాన్వీ ఆవేదనలో అర్థం ఉంది..!



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా బాలీవుడ్లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. ఆకట్టుకునే అందంతో పాటు ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ ఉండటంతో జాన్వీ కపూర్ కి సినిమా ఆఫర్లకి కొదవలేదు. బాలీవుడ్ నుండి ఇప్పటి వరకు ఆమెకి సక్సెస్ దక్కలేదు, అయినప్పటికీ వరుస సినిమా అవకాశాలు వస్తున్నాయి. అయితే కేవలం నెపోకిడ్ కావడం వల్లే కాకుండా ఆమె తన అందంతో ఆకట్టుకుంటున్న కారణంగా కూడా అవకాశాలు వస్తున్నాయి అనేది కొందరి అభిప్రాయం. బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ సమాంతరంగా సినిమాలు చేస్తున్న జాన్వీ కపూర్ ప్రస్తుతం రామ్ చరణ్తో కలిసి బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమంలో ఇటీవల జాన్వీ కపూర్ పాల్గొంది. జాన్వీ కపూర్ గతంలో మీడియాపై అసహనం వ్యక్తం చేస్తూ వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు మరోసారి జాన్వీ కపూర్ మీడియాపై అసహనం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అవుతున్నాయి.

**బాలీవుడ్ లెజెండ్ ధర్మేంద్ర...**

బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మరణ వార్తలను కొన్ని మీడియా వర్గాల వారు ప్రముఖంగా ప్రచారం చేశాయి. అయితే అందులో తప్పేం లేదు కానీ ఆయనకి సంబంధించిన కొన్ని తప్పుడు విషయాలను మీడియాలో ప్రముఖంగా ప్రచారం చేశారు అనేది ఇండస్ట్రీ వర్గాల వారి ఆరోపణ. తాజాగా జాన్వీ కపూర్ అదే విషయాన్ని లేవనెత్తింది. తన తల్లి శ్రీదేవి చనిపోయిన సమయంలో తప్పుడు వార్తలతో జనాలను తప్పు ద్రోవ పట్టించే ప్రయత్నం చేశారు, ఇప్పుడు అదే విధంగా ధర్మేంద్ర గారు చనిపోయిన విషయంలోనూ మీడియా తప్పుడు వార్తలను వండి వడ్డించే ప్రయత్నాలు చేస్తుందని జాన్వీ కపూర్ ఆరోపించింది. ఒకవైపు వ్యక్తి చనిపోయిన బాధలో కుటుంబం ఉంటే మరోవైపు మీడియాలో వచ్చిన కథనాలతో వారు తీవ్ర ఆవేదనకి గురవుతున్నారని జాన్వీ తన ఆవేదనని వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా ఎవరికి తోచిన విధంగా వారు చనిపోయిన వారి గురించి మాట్లాడటం ఏమాత్రం కరెక్ట్ కాదని ఆమె సీరియస్ గా కామెంట్ చేసింది.

**శ్రీదేవి చనిపోయిన సమయంలో...**

జాన్వీ కపూర్ ఇంకా మాట్లాడుతూ.. నా తొలి సినిమా విడుదల కాకముందే అమ్మ చనిపోయింది. ఆమె గురించి సినిమా ప్రమోషన్ సమయంలో మాట్లాడినా కూడా కొందరు విమర్శించారు. ఆ ట్రోల్స్ నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. నేను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందు అమ్మ చనిపోవడంతో ఆమె గురించి ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవడం జరిగింది, దాన్ని కూడా కొందరు తప్పుపడుతూ విమర్శలు చేయడం చాలా బాగా అనిపించింది. అప్పుడు నేను ఏం మాట్లాడినా కూడా కొందరు విమర్శించడానికి రెడీగా ఉండేవారు. దాంతో నేను కొన్నాళ్ల పాటు మీడియాకి దూరంగా ఉన్నాను. సోషల్ మీడియాలో కూడా ఎక్కువగా ఉండేదాన్ని కాదు. ఆ కారణాల వల్ల నేను ఆ బాధని తప్పించుకోగలిగాను. ఒక తల్లి చనిపోతే కూతురు బాధపడితే దాన్ని కూడా కొందరు ట్రోల్ చేయడం దారుణం అనిపించింది. అప్పుడు అమ్మ చనిపోయినప్పుడు ఎలా అయితే మీడియా వ్యవహరించిందో ఇప్పుడు ధర్మేంద్ర గారు చనిపోయిన సమయంలో కూడా మీడియా అలాగే వ్యవహరిస్తుందని జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది.

**సోషల్ మీడియాపై జాన్వీ కపూర్..**

కేవలం శ్రీదేవి, ధర్మేంద్ర విషయంలోనే కాకుండా చాలా మంది సెలబ్రిటీల విషయంలో ఇలా జరుగుతుందని జాన్వీ కపూర్ ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడింది ఆమె మాటల్లో అర్థం ఉందని, తల్లి చనిపోయిన సమయంలో ఆమె పడ్డ మానసిక క్షోభ తో పాటు సోషల్ మీడియాలో ఆమెపై వచ్చిన ట్రోల్స్ ఆమెను మరింతగా ఇబ్బంది పెట్టాయి అని సన్నిహితులు అంటున్నారు సోషల్ మీడియాలో ఆమెకు మద్దతుగా నిలిచిన వారు ఇప్పుడు ఆమె వ్యాఖ్యలను షేర్ చేస్తూ మీడియా విషయంలో తమ అసహనం వ్యక్తం చేస్తూ సమాధానం ఇస్తున్నారు. జాన్వీ కపూర్ ఈ విషయం గురించి ఇంకా మాట్లాడాల్సిన అవసరం లేదని మీడియాలో వచ్చిన తప్పుడు వార్తలను జనాలు నమ్మే రోజులు ఎప్పుడో పోయాయి అంటూ ఆమె అభిమానులు ఇంకా శ్రేయోభిలాషులు ఆమెకి సూచిస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల పై ఫోకస్ పెట్టాలి కానీ మీడియాలో వస్తున్న విమర్శల గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**రామ్ చరణ్, బుచ్చిబాబు పెద్ది సినిమా...**

ఇక జాన్వీ కపూర్ సినిమాల విషయానికి వస్తే ఈ సంవత్సరం ఆమె నుండి వరుసగా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. హిందీలో ఈమె నటించిన సినిమాలు ఇంతకు ముందు మాదిరిగానే నిరాశ పరిచాయి. తప్పకుండా విజయం సాధిస్తాయి అనుకున్న సినిమాలు సైతం బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్ల పడ్డాయి. అయినా కూడా జాహ్నవి కపూర్ ఏమాత్రం తగ్గలేదు, వరుస సినిమాలతో వచ్చే ఏడాది వచ్చేందుకు రెడీ అవుతుంది. ముఖ్యంగా ఈమె నటిస్తున్న రామ్ చరణ్ పెద్ది సినిమా విషయంలో అంచనాలు భారీగా ఉన్నాయి. ఉప్పెన వంటి సూపర్ హిట్ సినిమాను తెరకెక్కించి సక్సెస్ దక్కించుకున్న సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నాడు. పైగా ప్రముఖ సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్న నేపథ్యంలో పెద్ది సినిమా ఖచ్చితంగా బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే విశ్వాసాన్ని ప్రతి ఒక్కరి వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో ఈమె నటించిన దేవర సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. పైగా ఆ సినిమాలోని పాత్ర విషయంలోనూ విమర్శలు ఎదుర్కొంది.

## సినీ వాయిస్ CINEMA




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో భారీ కాన్వాస్ పై ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గ్లోబల్ స్థాయిలో ఈచిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఒక్క హిట్‌తో బన్నీ? ఇంటర్నేషనల్ స్టార్ అవ్వాల్సిందే అన్నంత కసిగా అట్లీ పని చేస్తున్నాడు. అమెరికాలోని ప్రఖ్యాత ఫిలిం స్టూడియోలు..ల్యాబ్ లు ఈ సినిమా కోసం బ్యాకెండ్ లో వర్క్ చేస్తున్నాయి. సినిమా ప్రారంభానికి ముందే అట్లీ బోలెడంత ప్రీవర్క్ చేసాడు. అంతా పక్కాగా అనుకున్న తర్వాతే పట్టాలెక్కించాడు. ఇక ఈ సినిమా షూటింగ్ కొన్ని నెలల క్రితం ముంబైలో ప్రారంభమైన సంగతి తెలిసిందే.

**సొంత పరిశ్రమలను పక్కనబెట్టి:**

అప్పటి నుంచి షూటింగ్ ముంబైలోనే జరుగుతుంది. ఇంత వరకూ అట్లీ-బన్నీ హైదరాబాద్, చెన్నై సిటీలు చూసింది లేదు. తెలుగు హీరో..తమిళ డైరెక్టర్ కలిసి పని చేస్తున్నారంటే? తొలి ప్రాధాన్యత ఆయా సొంత పరిశ్రమలకు ఇస్తారనుకోవడం సహజం. కానీ వీరిద్దరు మాత్రం చెన్నై, హైదరాబాద్ ని పక్కన బెట్టి ముంబైలోనే మకాం వేసి పని చేస్తున్నారు. ముంబై లో ప్రత్యేకమైన టీమ్ లను నియమించుకుని పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఎన్ని షెడ్యూల్స్ పూర్తయ్యాయి? అన్నది ఇంకా బయటకు రాలేదు. మరి షూటింగ్ అంతా ముంబైకే పరిమితం చేస్తారా? కొన్ని షెడ్యూల్స్ అయినా? చెన్నై, హైదరాబాద్ లో ప్లాన్ చేస్తున్నారా? అన్నది తెలియాలి.

**ముంబై టీమ్స్ తోనే:** పూర్తి చేయాల్సిన షూటింగ్ పార్ట్ ఇంకా చాలా ఉంది. ఈ సినిమాకు ఎక్కువగా సెట్లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముంబైలోనే సెట్లు వేసి షూటింగ్ చేస్తున్నారు. ఔట్ డోర్ సన్నివేశాలుంటే? ముంబై ఔట్ కట్స్ లో షూట్ చేస్తున్నారు. ఇలా టీమ్ ముంబైకి పరిమితం అవ్వడంతో షూటింగ్ అప్ డేట్స్ కూడా లీక్ అవ్వడం లేదు. సినిమాకు పని చేస్తోన్న వారంతా ఎక్కువగా ముంబై, చెన్నైకి చెందిన వారు కావడంతో? ఏ వివరాలు లీక్ అవ్వడం లేదు. ఎలాంటి లీకులు జరగకూడదని అట్లీ ముంబైలో షూట్ చేస్తున్నాడా? అన్న డౌట్ కూడా చాలా మందిలో రెయిజ్ అవుతుంది. రిలీజ్ పై క్లారిటీ ఎప్పుడు? అయితే ముంబైలో ఉన్నన్ని గొప్ప స్టూడియోలు హైదరాబాద్, చెన్నైలో లేవు. టెక్నికల్ స్క్రిప్ట్ కావడంతో? ముంబైకి పరిమతమయ్యారు? అన్నది మరికొంత మంది అభిప్రాయం. బన్నీ మాత్రం హైదరాబాద్ వచ్చి వెళ్తున్నాడు తప్ప ఎలాంటి అప్ డేట్ ఇవ్వడం లేదు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com